
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

మంగళవారం, 24 సెప్టెంబరు 2024



లోకమాతా వారాహీ

ఉగ్రరూపానికి ప్రతీక అయిన వారాహీదేవిని పూజించవద్దనే దుష్ప్రచారాన్ని పారదోలి, లోకదేవి వారాహీదేవి అని తెలియజేసేందుకే ఈ వారాహీ రథయాత్ర చేపట్టినట్లు ఆదిపరాశక్తి టెంపుల్స్ ట్రస్టుకు చెందిన వారాహీ మహారుద్రస్వామి తెలిపారు. తిరుపతి నుంచి బయలుదేరిన వారాహీ రథయాత్ర సోమవారం ఉదయం 10 గంటలకు నెల్లూరుకు చేరుకుంది. అయ్యప్పస్వామి ఆలయం వద్ద రథయాత్రకు భక్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రాజరాజేశ్వరి ఆలయం, శబరి శ్రీరామక్షేత్రం, వీఆర్‌సీ సెంటర్, గాంధీ బొమ్మమీదుగా వీఆర్ హైస్కూలు మైదానానికి చేరుకుంది. అక్కడ వారాహీ మహాహోమం జరిగింది. ఈ సందర్భంగా మహారుద్ర స్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే సంకల్పంతో రథయాత్రలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, విశాఖ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో రథయాత్రలు, మహాయజ్ఞాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు, భక్తులు పాల్గొన్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)



రథం ముందు మహిళల కోలాటం

కలెక్టరేట్‌లో పనిచేసేందుకు ఉద్యోగుల్లో వణుకు | కోర్టు కేసులు, భూ సమస్యలే ప్రధాన కారణం | జిల్లా పరిపాలనా కేంద్రంలో 22 పోస్టుల ఖాళీ | మండలాల నుంచి తీసుకొచ్చి నెట్టుకొస్తున్న వైనం | తాజాగా బదిలీ చేసినా ఎమ్మెల్యేలతో ఫోన్లు

మాకొద్దు బాబోయ్!



'కలెక్టరేట్‌లో పోస్టా.. అమ్మ బాబోయ్ మాకొద్దు. జిల్లా కేంద్రానికి సుదూరంగా ఉన్న సీతారామపురం, కొండాపురం వంటి ప్రాంతాల్లోనైనా పని చేస్తాం. కలెక్టరేట్‌లో అయితే వద్దే వద్దు.'

రెవెన్యూ ఉద్యోగుల తీరిది. ఎవరూ పని చేసేందుకు రాకపోవడంతో కొన్నేళ్లుగా కలెక్టరేట్‌లో చాలా సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. తాజా బదిలీల్లో కూడా పలువురు ఉద్యోగులకు కలెక్టరేట్‌లో పోస్టింగ్స్ ఇవ్వగా చాలామంది తప్పించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఎమ్మెల్యేల ద్వారా ఉన్నతాధికారులకు ఫోన్లు చేయించుకుంటూ వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు ముమ్మరంగా యత్నిస్తున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు ఉన్నతాధికారులకు కూడా తలనొప్పిగా మారింది.

నెల్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పాలన కేంద్రమైన కలెక్టరేట్‌లో పని చేయడమంటే ఒకప్పుడు రెవెన్యూ ఉద్యోగులు గౌరవంగా భావించేవారు. ఎందుకుంటే ఇక్కడి నుంచే అన్ని మండలాల పరిపాలనను పర్యవేక్షించేవారు. ప్రతీ ఫైలూ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల చేతుల మీదుగా నడుస్తుంది కాబట్టి. అయితే గత ప్రభుత్వంలో పాలన పూర్తిగా గాడితప్పింది. ఉన్నతాధికారుల ఆదేశాల కన్నా రాజకీయ నాయకుల ఆదేశాలే శిరోధార్యం అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. దీంతో పాలనలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ప్రధానంగా జిల్లాలో భూ సమస్యలు పెరిగిపోయి, కోర్టు కేసులు కూడా అధికమయ్యాయి. ఈ ప్రభావం మండల స్థాయిలో పనిచేసే ఉద్యోగుల కన్నా కూడా కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులపై ఎక్కువగా పడుతోంది. ఒక్క భూ సమస్యలే కాకుండా ఇతరత్రా వ్యవహారాలకు సంబంధించి కూడా సమస్యలు ఎక్కువయ్యాయి. అదే సమయంలో రాజకీయ ఒత్తిళ్లు కూడా అధికమవడంతో కలెక్టరేట్‌లో ఉద్యోగం అంటేనే ఉరుకులు, పరుగులు అన్నట్లుగా మారిపోయింది. 'సమయానికి కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. ఎప్పటికి తిరిగి వెళతామో తెలియదు. అదే మండలాల్లో అయితే కొంత ఫ్రీడం ఉంటుంది. పని విషయంలో కూడా మరీ ఒత్తిడి ఉండదు' అంటూ ఓ అధికారి వ్యాఖ్యానించడం గమనార్హం.

● డ్రాఫ్టింగ్ సమస్య

కలెక్టరేట్‌లోని సెక్షన్లలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ కేడర్ ఉద్యోగులకు డ్రాఫ్టింగ్ స్కిల్స్ చాలా అవసరం. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తరఫున ప్రతి ఫైల్‌ను వీరే డ్రాఫ్ట్ చేయాల్సి ఉంటుంది. అందుకు సబ్జెక్ట్‌పై కూడా అవగాహన ఉండాలి. అదే సమయంలో ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ప్రధానమైన కోర్టు కేసులకు సంబంధించి వేగంగా కౌంటర్‌లు తయారు చేయాల్సి వస్తోంది. మండలాల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని ఆ సమాచారాన్ని కలెక్టర్, జేసీలకు అందించాల్సి ఉంటుంది. అయితే చాలా మందికి డ్రాఫ్టింగ్ సమస్య కనిపిస్తోంది. కోర్టు కేసులకు కౌంటర్ తయారు చేయడం కూడా చేతకావడం లేదు. మండల స్థాయిలోని ఉద్యోగులు సరిగ్గా కౌంటర్ వేయలేకపోతుండడం మూలంగా ఉన్నతాధికారులపై కంటెప్ట్‌లు వస్తున్నాయి. వాటికి కౌంటర్‌లు తయారు చేయడం కలెక్టరేట్ సిబ్బందికి కష్టంగా అనిపిస్తోంది. అలానే ల్యాండ్ మేటర్స్‌కు సంబంధించి ఫైళ్లు నడపాలంటే చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలి. ఇది కూడా ఒక సమస్యగా కనిపిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు.

● పోస్టింగ్ అక్కడ.. విధులు ఇక్కడ

కలెక్టరేట్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల్లో చాలా మంది ఒరిజినల్ పోస్టింగ్‌లు అక్కడ కాదు. ఎక్కడో మండలాల్లో వీరు జీతాలు తీసుకుంటుంటారు. కానీ విధులు మాత్రం కలెక్టరేట్‌లో నిర్వహిస్తుంటారు. ఒరిజినల్‌గా కలెక్టరేట్‌లో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులు వేర్వేరు మండలాల్లో పని చేస్తుంటారు. గడిచిన కొన్నేళ్లుగా ఇదే తంతు నడుస్తోంది. ప్రస్తుతం వివిధ సెక్షన్లలో 22 సీట్ల వరకూ ఖాళీగా ఉన్నట్లు సమాచారం. ఈ సీట్లలో వివిధ మండలాల్లో పనిచేయాల్సిన వారిని తీసుకొచ్చి పాలన నెట్టుకొస్తున్నారు. తాజా బదిలీల్లో కూడా చాలా వరకూ మండలాలు, డివిజనల్ కార్యాలయాలకు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తీసుకొచ్చారు. కానీ కలెక్టరేట్‌లో పని చేస్తామని మాత్రం ఆసక్తి చూపడం లేదు. దీంతో ఉన్నతాధికారులే కొంత మందిని ఎంపిక చేసి కలెక్టరేట్‌లో పోస్టింగ్ వేశారు. కానీ వీరిలో కూడా చాలా మంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేల ద్వారా ఫోన్లు చేయిస్తూ ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు.

లడ్డూ కల్తీపై సీబీఐతో విచారించాలి

● తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వారిని శిక్షించాలి

● కలెక్టరేట్ ఎదుట స్వామీజీల ఆందోళన

నెల్లూరు (హరనాథపురం) : శ్రీవారి లడ్డూలో జంతువుల అవశేషాల కలిపిన అంశమై సీబీఐ చేత విచారణ జరిపించాలని కోరుతూ జిల్లాకు చెందిన పలువురు స్వామీజీలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామయణం మహేష్ స్వామి, దయానంద స్వామి, రామానందగిరి స్వామి, శ్రీ శ్యామానందస్వామి, శ్రీ రాజరాజేశ్వరి రంగనాథ భక్త మండలి సభ్యులు మాట్లాడారు. కాసులకు కక్కుర్తి పడో, హిందువుల మనోభావాలు దెబ్బతీయాలనో కుట్రపూరితంగా లడ్డూలో జంతువుల అవశేషాలు కలిగిన కొవ్వును కలపడం క్షమించరాని నేరమని అన్నారు. లడ్డూను అపవిత్రం చేయడమేగాక ఆ లడ్డూలను అయోధ్య బాల రాముడికి పంపించి మరింత అపచారానికి ఒడిగట్టారని మండిపడ్డారు. ఆ నీచులను శిక్షించేందుకు సీబీఐ బృందం ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ తిరుమలలో నెయ్యి కల్తీని సమర్థించేలా మాట్లాడటం ఆయన పరమత విధానాన్ని బయట పెడుతుందన్నారు. తిరుమల ఆలయాన్ని శుద్ధి చేస్తే గాయపడిన హిందువుల మనసులు, శ్రీవారి భక్తుల హృదయాలు శాంతించవన్నారు. ప్రభుత్వాలు రాజకీయ ఒత్తిడితో ఇతర మతస్తులను పాలక మండలి సభ్యులుగా, ఉద్యోగులుగా నియమించడం కూడా ఆలయ పవిత్రను దెబ్బతీస్తుందని ఆరోపించారు. బాధ్యులపై వెంటనే కేసులు నమోదు చేయించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో బీజేపీ నేతలు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, మిడతల రమేష్, కందికట్టు రాజేశ్వరమ్మ, కరణం సుభాషిణి, శ్రీరాజరాజేశ్వరి రంగనాథ భక్తమండలి సభ్యుడు మెంటా రామమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇస్తున్న స్వామీజీలు, బీజేపీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వీఆర్‌ఏల దుర్మరణం

కలిగిరి, సెప్టెంబరు 23: లక్ష్మీపురం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలదంకి మండలం కొదండరామాపురం వీఆర్‌ఏలు వంకదారి మాల్యాద్రి(49), వడ్డే శ్రీనివాసులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాల మేరకు.. సిద్దనకొండూరు నుంచి వీరు తమ స్వగ్రామానికి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా చినక్రాకకు చెందిన ట్రాక్టర్ ఇసుకలోడ్‌తో సిద్దనకొండూరు వైపు వస్తుండగా లక్ష్మీపురం సమీపంలో ఢీకొన్నది. ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఉమాశంకర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



మాల్యాద్రి శ్రీనివాసులు

నెల్లూరు సబ్ రిజిస్ట్రారా.. మేం రాం!

● బదిలీల్లో ముందుకురాని అధికారులు

● ఏసీబీ దాడులు.. సస్పెన్షన్లే కారణం



నెల్లూరు (హరనాథపురం) : నెల్లూరు సబ్ రిజిస్ట్రార్ పోస్టు అంటేనే అధికారుల్లో వణుకు పుడుతోంది. ఆదివారం రాత్రి జరిగిన స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ బదిలీల్లో ఏ సబ్ రిజిస్ట్రార్ కూడా ఈ సీటును కోరుకోలేదు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే కొందరు సబ్ రిజిస్ట్రార్లు అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా ఏసీబీ అధికారులకు పట్టుబడి సస్పెన్షన్లకు గురవుతుండటమే ఇందుకు కారణం. అంతేగాక మార్కెట్ వ్యాల్యూ చూసే సీనియర్ సహాయకులపై వేటు పడుతోంది. పలు ఆరోపణలు ఈ కార్యాలయంపై ఉండటంతో ఎవరూ సాహసించి ఈ సీటు కోరుకోవడం లేదు. దీంతో విధిలేని స్థితిలో ఈ సబ్ రిజిస్ట్రార్ సీటుకు సీనియర్ సహాయకుడు, మరోచోట పనిచేసే సబ్ రిజిస్ట్రార్‌ను, డిప్యూటేషన్‌పై సబ్ రిజిస్ట్రార్‌ను నియమించాల్సి వస్తోంది. కాగా, ఈ కార్యాలయంలో పనిచేసే జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కూడా ఇక్కడ పనిచేయలేక గుంటూరు జిల్లాకు బదిలీ చేయించుకుని వెళ్లారు. జూనియర్ సహాయకులు కూడా మరోచోటకు బదిలీ చేయించుకుని వెళ్లడం గమనార్హం.

● 11 మంది కొత్త సబ్ రిజిస్ట్రార్లు

బదిలీల కౌన్సెలింగ్ ద్వారా జిల్లాకు 11 మంది కొత్త సబ్ రిజిస్ట్రార్లు వచ్చారని స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ కిరణ్ కుమార్ తెలిపారు. అల్లూరుకు రవిజోసఫ్, ముత్తుకూరుకు ప్రసన్నలక్ష్మి, ఇందుకూరుపేటకు భానుమతి, రాపూరుకు అమర్ (పదోన్నతి), బుచ్చిరెడ్డిపాళెంకు కోటేశ్వరమ్మ, కావలికి సుమలత, వింజమూరుకు కోటేశ్వరరావు, స్టోన్‌హౌస్‌పేటకు రాధాకృష్ణమూర్తి, ఆత్మకూరుకు శ్రీనివాస్, బుజబుజనెల్లూరుకు ప్రవీణ, కందుకూరుకు రామకోటయ్య నియమితులైనట్లు తెలిపారు. అదేవిధంగా 20 మంది సీనియర్ అసిస్టెంట్లకు కూడా బదిలీలు జరిగాయని తెలిపారు. బదిలీపై వచ్చిన వారు బుధవారం బాధ్యతలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

దేవదాయ శాఖ సహాయ కమిషనర్‌గా జనార్దన్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 23 : జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్‌గా కోవూరు జనార్దన్‌రెడ్డి నియమితులయ్యారు. ఒంగోలు ఏసీగా పని చేస్తున్న ఈయన బదిలీపై నెల్లూరుకు వచ్చారు. అలాగే రాజరాజేశ్వరి ఆలయ ఈవోగా జనార్దన్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. ప్రస్తుత ఏసీ కె. శ్రీనివాసరావును మూలపేట వేణుగోపాల స్వామి, ఇరుకళల పరమేశ్వరి ఆలయాల ఈవోగా నియమించారు. పెంచలకోన ఈవో, డిప్యూటీ కమిషనర్‌గా పోరెడ్డి శ్రీనివాసు లురెడ్డి నియమితులయ్యారు. అక్కడున్న సాగర్ బాబును వలేటివారిపాళెం మండలం మాలకొండ ఆలయానికి బదిలీ చేశారు. వేణుగోపాలస్వామి ఆలయ ఈవో దాసరి చంద్రశేఖర రావును ప్రకాశం జిల్లాకు, రాజరాజేశ్వరి ఆలయ సహాయ కమిషనర్ బీవీ. వెంకటసుబ్బయ్యలను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. వీరితోపాటు వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లనూ బదిలీ చేశారు.



పెంచలకోన ఆలయ ఈవోగా నియమితులైన పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి



జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి

మైనింగ్ శాఖ డీడీగా చంద్రశేఖర్

● విజయవాడకు శ్రీనివాస కుమార్ బదిలీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లా మైనింగ్ శాఖ డీడీగా ఎన్.చంద్రశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడున్న శ్రీనివాస కుమార్‌ను విజయవాడ డీడీగా బదిలీ చేసింది. కాగా, గూడురు సబ్ డివిజన్ ఏడీగా ఉన్న రంగకుమార్‌ను అన్నమయ్య జిల్లా మదనపల్లికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో పార్వతీపురం నుంచి కే.శ్రీనివాస్ నియమితులయ్యారు. అదే విధంగా నెల్లూరు మైనింగ్‌శాఖ ఆర్‌ఐగా ఉన్న దేవిసింగ్‌ను అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఇబ్రహీంపట్నం నుంచి సీహెచ్ స్వాతిని నియమించారు. గూడూరు ఏజీ నరేష్‌ను తిరుపతికి బదిలీ చేయగా, అనకాపల్లి నుంచి టీ.సుబ్బరాయుడును ఆయన స్థానంలో నియమించారు. గూడురు ఆర్‌ఐగా ఉన్న గంగాధర్‌ను ఇబ్రహీంపట్నంకు బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఇబ్రహీంపట్నం నుంచి ఎం.బాలమురళిని నియమించారు.

జిల్లా పరిషత్‌లో భారీగా బదిలీలు

● 20 మంది ఎంపీడీవోలకు స్థానచలనం

నెల్లూరు (జడ్పీ): జిల్లా పరిషత్‌లో ఎంపీడీవోల నుంచి కార్యాలయ సబార్డినేట్స్ వరకు 272 మందిని బదిలీ చేస్తూ కలెక్టరు ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 20 మంది ఎంపీడీవోలు, 27 మంది ఏవోలు, 44 మంది సీనియర్ అసిస్టెంట్లు, 71 మంది జూనియర్ అసిస్టెంట్లు, 22 మంది టైపిస్టులు, 26 మంది గ్రంథాలయ అసిస్టెంట్లు, 62 మంది కార్యాలయ సబార్డినేట్స్ ఉన్నారు.

బదిలీ అయిన ఎమ్పీడీవోలు వీరే!

ఎంపీడీవో	ప్రస్తుతం	బదిలీ
ఎం.శ్రీహరి	కోవూరు	బుచ్చిరెడ్డిపాళెం
కె. ప్రత్యూష	ముత్తుకూరు	కలిగిరి
ఎం.బ్రహ్మయ్య	కొండాపురం	జలదంకి
ఎ.మధుసూదన రావు	అనంతసాగరం	గూడూరు
జి.వెంకటేశ్వర్లు	మనుబోలు	దగదర్తి
ఎం.భవాని	కోట	రాపూరు
ఎ. ప్రమీలా రాణి	సూళ్లూరుపేట	పెళ్లకూరు
ఎం. భాస్కర్	సెలవుల్లో..	ఎస్ఆర్ పురం
కె. వెంకటేశ్వర రావు	గూడూరు	టీపీ గూడూరు
కె. సురేష్‌బాబు	పెళ్లకూరు	నాయుడు పేట
పి. ప్రసన్నకుమారి	డక్కిలి	ఏఎస్‌పేట
కె. గోవర్ధన్	కలువాయి	డీవీ సత్రం
వీ. రజినీ కాంత్	ఓజిలి	అల్లూరు
డివి నరసింహారావు	బుచ్చిరెడ్డిపాళెం	పొదలకూరు
ఎవీ సుబ్బారావు	బోగోలు	కొడవలూరు
పి. సుబ్రహ్మణ్యం	కొడవలూరు	బోగోలు
కె. షాలేట్	చిట్టమూరు	సంగం
పి. నాగమణి	మర్రిపాడు	ముత్తుకూరు
టి నాగేష్‌కుమారి	పొదలకూరు	విడవలూరు
వివి. సూర్యసాయి	చిల్లకూరు	వాకాడు

గంజాయిని సమూలంగా నిర్మూలించండి!

● మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

● నేర సమీక్షలో గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 23 : జిల్లాలో గంజాయిని సమూలంగా నిర్మూలించాలని, మూలాలతో సహా ఛేదించడం ద్వారానే రాబోయే భావితరాల పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సమాజంలో పరిస్థితులను బట్టి పోలీసులు విధులు నిర్వహించాలని సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని కోణాలలో ఛేదించి తప్పిపోయిన తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశించారు. మహిళలు, బాలికలు, వృద్ధుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ట్రాఫిక్‌పై దృష్టి సారించి, కొన్ని ప్రాంతాలను దత్తత తీసుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని, హైవేపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాదాలు నివారించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లకు తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాడంతోపాటు వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, కేసులు ఉన్న వ్యక్తులను బైండోవర్ చేయాలన్నారు. జిల్లాలో కుల, మత విద్వేషాలు లేకుండా పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలన్నారు. లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో జిల్లా ప్రథమస్థానంలో నిలవడం, ముత్తుకూరు పరిధిలో జరిగిన దోపిడీ కేసును గంటల వ్యవధిలో ఛేదించడం అభినందనీయమన్నారు. ఎస్పీ కె కృష్ణకాంత్ మాట్లాడుతూ రాత్రింబవళ్లు గస్తీలను పటిష్ఠంగా అమలుపరచాలని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలన్నారు. పల్లె నిద్ర, విలేజ్ విజిట్ తప్పక చేయాలని, సైబర్ నేరాలు, ఇతర చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, లీగల్ అడ్వయిజర్ శ్రీనివారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



నేర సమీక్షలో పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న ఐజీ త్రిపాఠి, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

● వారంలో 2 రోజులు.. 4 గ్రామాల్లో నిర్వహణ

నెల్లూరు (వ్యవసాయం) : పంటల సాగులో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. గత ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించడం, పొలంబడి కార్యక్రమానికి పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకపోవడంతో అధికారులు మమ అనిపించారన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పొలంబాట పట్టనున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ, దానిఅనుబంధ మత్స్య, ఉద్యాన, పశుసంవర్థక, సేంద్రియ, మార్కెటింగ్‌శాఖల అధికారులు సమన్వయంతో రైతుల సమస్యలు పరిష్కరించనున్నారు. ప్రతిశాఖ అధికారి రైతు వద్దకు వెళ్లి పంట పరిశీలించి లోపాలను గుర్తించి సేకరించిన వివరాలు ఉన్నతాధికారులకు నివేదించాలి. వీటిని శాస్త్రవేత్తల బృందం పరిశీలించి రైతులకు అవసరమైన కార్యక్రమాలను చేపట్టాలి. ఈ కార్యక్రమంలో ప్రతి మంగళ, బుధవారాల్లో 4 గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

● ఖర్చులు తగ్గించడమే లక్ష్యం

వ్యవసాయంలో పెట్టుడులు తగ్గించి ఆదాయం పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశం. బిందు సేద్యం, భూసార పరీక్ష ఫలితాల కార్డుల పంపిణీ, కౌలు రైతుల గుర్తింపు, కార్డుల మంజూరు, రైతు సంఘాల ఏర్పాటు, రుణాల మంజూరు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించడం, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి పిలుపునిచ్చారు.

26న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం

నెల్లూరు (హరనాథపురం) : ఈనెల 26న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లాస్థాయి సమావేశం జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.మహీధర్, కార్యదర్శి ఎస్. విజయకుమార్ ఒక సంయుక్త ప్రకటలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని వెటర్నరీ పాలిక్లినిక్‌లో జరిగే ఈ సమావేశంలో ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు.

'విజయ'లో 4 నామినేషన్ల దాఖలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : విజయ డెయిరీలో మూడు డైరెక్టర్ పదవులకు సోమవారం 4 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వాసలి పాల సొసైటీ నుంచి గంగా శ్రీనివాసులు, తిరుమలపూడి నుంచి బాబు నాయుడు, నారికేళ్లపల్లి నుంచి చంద్రశేఖర్‌రెడ్డి, విడవలూరు మండలం అన్నారెడ్డిపాళెం నుంచి శ్రీహరి నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం సాయంత్రం వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఈలోగా ఒకరు ఉపసంహరించుకొంటే మిగతా ముగ్గురు సభ్యులు ఏకగ్రీవం అవుతారు. లేదా 28న ఎన్నికలు జరపనున్నారు.

● ప్రమాదం జరగకముందే కళ్లు తెరవండి!



సంగం మండలంలోని కనిగిరి ప్రధాన కాలువ నుంచి ప్రారంభమయ్యే డీబీ చానల్ రెగ్యులేటర్ వంతెన వద్ద రోడ్డు కోతకు గురయ్యింది. డీబీ చానల్ కింద మండలంతో పాటు బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు, పంచేడు ప్రాంతంలో సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గత వర్షా కాలంలో నీటి ప్రవాహం కారణంగా వంతెన పక్కనే కోతకు గురయ్యింది. అప్పటి నుంచి నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుత సీజన్‌లో భారీ వర్షాలు కురిస్తే కోతకు గురైన గండి మరింత పెద్దదై పల్లిపాళెం రహదారితోపాటు డీబీ చానల్ రెగ్యులేటర్‌కు ప్రమాదం పొంచి ఉంది.

- సంగం

● పచ్చని చేను కాదండోయ్..!



ఈ చిత్రంలో కనిపిస్తున్నది పచ్చని పొలమనుకుంటే పొరపాటుపడ్డట్లే. ఉదయగిరి ఆనకట్ట నీటిలో గుర్రపుడెక్క, తుంగ, వ్యర్థాలతో నిండిపోయింది. గత మూడేళ్ల క్రితం చిన్నపాటి వర్షపు నీటితో మొలకెత్తిన గుర్రపుడెక్క, తుంగ ప్రస్తుతం యంత్రాలతో తొలగించాల్సినంతగా పెరిగిపోయింది. అంతేగాక దుర్గంధం వెదజల్లడంతోపాటు దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆనకట్టపై వాకింగ్ చేసేవారు, సమీప నివాసాల వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తొలగించాలని పలువురు కోరుతున్నారు.

-- ఉదయగిరి రూరల్

● నర్సమ్మే డాక్టరు!



పీహెచ్‌సీ వైద్యులు ధర్నాలో ఉండడంతో 6 రోజులుగా రోగులకు స్టాఫ్ నర్సే (నర్సమ్మ) దిక్కయింది. సర్వీసు కోటాను 30 నుంచి 15 శాతానికి కుదించడంతో వైద్యులు ధర్నా చేస్తున్నారు. దీంతో మండలంలో ఉన్న ఇద్దరు మహిళావైద్యులు ఆందోళనలో పాల్గొంటుండటంతో పీహెచ్‌సీకి వచ్చే రోగులకు స్టాఫ్‌నర్సే పరీక్షలు చేసి మందులు ఇచ్చి పంపుతున్నారు.

- మనుబోలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెంకటాచలం, సెప్టెంబరు 23: మండలంలోని టోల్‌ప్లాజా వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు, గుడ్లూరుకి చెందిన వ్యాపారి సైదులు చెన్నైలో కోడిగుడ్లు కొనుగోలు చేసుకుని, బొలేరో వాహనంలో తిరిగి వస్తుండగా వారు వస్తున్న వాహనం ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో గుడ్లూరుకి చెందిన బొలేరో డ్రైవర్ అశోక్ (33) వాహనంలోనే ఇరుక్కొని అక్కడిక్కడే మృతి చెందాడు. వ్యాపారి సైదులుతోపాటు ఆయన అన్న కుమార్తె శ్రీమల్లి గాయపడ్డారు. బాధితులంతా గుడ్లూరుకి చెందినవారే. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను నెల్లూరుకి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వాహనంలో ఇరుక్కొని మృతి చెందిన అశోక్

అనుమానాస్పదంగా వ్యక్తి...

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 23 : నెల్లూరులోని శ్రీనివాసనగర్ 6వ వీధిలో ఉన్న తన మెకానిక్ షాపులోనే ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని బంగ్లాతోటకు చెందిన పూనమల్లి మల్లికార్జున(46) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజూ మద్యం సేవిస్తూ ఇంటికి వెళ్లకుండా శ్రీనివాసనగర్ 6వ వీధిలో ఉన్న తన మెకానిక్ షాప్‌లోనే నిద్రించేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఆయన షాపులోనే కింద పడి మృతి చెందాడు. ఆయన శరీరంపై రక్తపు గాయాలు ఉన్నాయి. విషయం తెలుసుకున్న మృతుడి కుమారుడు శివతేజ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి కుడి కంటిపై రక్తపుగాయాన్ని గుర్తించాడు. దీంతో తన తండ్రి మరణంపై అనుమానం ఉందని, సరైన కారణం తెలపాలని కోరుతూ నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు.

వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి

● దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 23 : పాముకాటుకు గురైన గిరిజనుడికి వైద్యం చేయడంలో నిర్లక్ష్యం వహించిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి మాట్లాడుతూ బోగోలు మండలం అల్లిమడుగు గిరిజన కాలనీకి చెందిన బొచ్చు శంకర్ అనే యువకుడు ఈనెల 3న పాముకాటుకు గురై కోవూరుపల్లి వైద్యశాలకు వెళితే వైద్యుడు వైద్యం చేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. దీంతో శంకర్ అక్కడికక్కడే మరణించాడని తెలిపారు. లక్షలాది రూపాయల జీతం తీసుకుంటూ నిర్లక్ష్యం వహించే వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బొచ్చు శీనమ్మ, బొచ్చు సుబ్బమ్మ, జరుగుమల్లి విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బాధితులు, దళిత సంఘర్షణ సమితి నాయకులు

'సోమశిల'లో 51.128 టీఎంసీల నీరు

అనంతసాగరం, సెప్టెంబరు 23: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 12,446 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 51.128 టీఎంసీలకు చేరుకుంది. దిగువ డెల్టాకు 600, కండలేరుకు 10,000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి అరెస్టు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 23: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేసిన ఉదయగిరి మండలం బండగానిపల్లి గ్రామానికి చెందిన భేరి తిరుపాలురెడ్డిపై కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్లు సీఐ ఎస్ వెంకటరావు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సోమవారం తెలిపారు. ఉదయగిరి సర్కిల్ పరిధిలో ఎవరైనా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం, ఇతరులను కించపరుస్తూ, వర్గవైషమ్యాలను రెచ్చగొడుతూ, అసభ్యకరంగా ప్రవర్తించే సమాచారాన్ని పోస్టు చేస్తే గ్రూపు అడ్మిన్‌లతోపాటు సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం జరుగుతుందని వారు హెచ్చరించారు.

కావలి శివారులో సింహం!

● హల్‌చల్ చేసిన వీడియో

● ఫేక్ అని కొట్టిపారేసిన అటవీ అధికారులు

కావలి, సెప్టెంబరు 23: పట్టణ ఉత్తర శివారులోని నయారా పెట్రోల్ బంకు వద్ద ఆదివారం రాత్రి ఒక సింహం సంచరించినట్లు కావలిలో సోమవారం ఒక వీడియో వైరల్ అయ్యింది. పెట్రోల్ బంకు వద్ద నయారా అని రాసి ఉన్న పేరు కనిపించటంతో వీడియో చూసిన కావలి ప్రజలు ఆందోళన చెందారు. దీనిపై అటవీశాఖ అధికారులను వివరణ కోరగా అది ఫేక్ వీడియో అని గుజరాత్‌లోని గిరి అడవుల ప్రాంతాలలోనే సింహాలు సంచరిస్తుంటాయని ఎక్కడా సింహాలు లేవని కావలి ఇన్‌చార్జి రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	128
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7190
వెండి కిలో ధర	రూ. 91,200
వెండి ఒక గ్రాము	రూ. 94.20

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించండి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 23 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన అర్జీలు మళ్లీ, మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. అవసమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఏవైనా అర్జీలు తిరస్కరిస్తే దానికి సంబంధించిన కారణం అర్జీదారులకు తెలియజేయాలన్నారు. మొత్తం 343 మంది అర్జీలు సమర్పించారని తెలిపారు.

● స్వర్ణాంధ్ర-2047 పోస్టర్ ఆవిష్కరణ

స్వర్ణాంధ్ర-2047 విజన్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశం సమగ్ర అభివృద్ధి సాధించాలనే లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్ కోసం సాధించాల్సిన ప్రగతిపై పోస్టర్ రూపొందించారన్నారు. ఈ ప్రక్రియలో ప్రజలు భాగస్వాములైతే సరైన ప్రణాళిక ద్వారా మెరుగైన సేవలు అందించే అవకాశం ఉందన్నారు. పోస్టర్‌లో ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ ఆలోచనలు పంచుకోవాలని కోరారు. ఈనెల 25వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నిర్వహించే స్వర్ణాంధ్ర-2047 విజన్ గ్రామసభల్లో ప్రజా ప్రతినిధులను, ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జేసీ కార్తీక్, డీఆర్వో లవన్న, సీపీవో రాజు తదితరులు పాల్గొన్నారు.

● ఇమామ్‌లకు గౌరవవేతనం ఇవ్వాలి

మసీదుల ఇమామ్‌లు, మౌజన్‌లకు ఇచ్చే రూ.15వేల గౌరవ వేతనం మూడు నెలలుగా ఇవ్వడం లేదని, వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ జియాఉల్ హక్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.



స్వర్ణాంధ్ర-2047 పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్

● చేపల మాఫియాపై చర్యలు తీసుకోండి

కండలేరు జలాశయంలో చేపల మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యనాది సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యానాదులు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. కండలేరు జలాశయం పరిధిలోని దాచూరు మత్స్యకార సహకార సంఘంలో సభ్యులు చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే దాచూరుకు చెందిన ఓ ఆరుగురు మాఫియాగా ఏర్పడి ఇతర ప్రాంతాల నుంచి సభ్యత్వం లేని వారిని తీసుకుని వచ్చి చేపలు పడిస్తూ తమ ఉపాధికి గండికొడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, ఇండ్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



పేర్లు నమోదు చేయించుకుంటున్న అర్జీదారులు



చేపల మాఫియాపై నినాదాలు చేస్తున్న యానాది సంఘం నాయకులు

ఎస్పీ గ్రీవెన్స్‌కు 152 ఫిర్యాదులు

నెల్లూరు (క్రైం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 152 మంది బాధితులు వచ్చి ఫిర్యాదులు అందజేశారు. డీటీసీ డీఎస్పీ ఎం గిరిధర్‌రావు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ జీ కృష్ణకాంత్ మాట్లాడుతూ స్వీక రించిన ఫిర్యాదులను పరిశీలించి త్వరితగతిన పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ గిరిధర్

ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలి

కోవూరు, సెప్టెంబరు 23: ఎన్నికల సందర్భంగా టీడీపీ, జనసేనలు ప్రజలకిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండు చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం జరిగిన కార్మిక సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాల్ని తక్షణమే అమలుచేయాలన్నారు. పేదలు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు సాగు హక్కు కల్పించాలని కోరారు. పెత్తందార్ల అనుభవంలో ఉన్న బంజరు భూమిని పేదలకు పంచాలన్నారు. పేదలకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. సమావేశంలో సీపీఐ నేత రామరాజు, రైతు సంఘం నాయకుడు షాన్‌వాజ్, కార్మిక సంఘం నాయకులు అజీజ్, దండూరి కామేశ్వర రావు, మున్వర్, శంకర్, యస్దానీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల శేఖర్

కులగణన ఆధారంగా రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

● బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 23 : కులగణన చేపట్టి బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్, విశ్రాంత డీజీపీ డాక్టర్ పూర్ణ చంద్రరావు కోరారు. సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ అసెంబ్లీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. లేకుంటే మన ప్రజాస్వామ్యం పాక్షిక ప్రజాస్వామ్యంగానే మిగిలిపోతుందన్నారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన వన్నీ, రక్షణ చట్టంతో సహా చేయాలంటే కులగణన కచ్చితంగా చేపట్టాలన్నారు. టీడీపీ ఎన్నికల ప్రచారంలో బీసీలకు స్థానిక సంస్థలు, చట్టసభలు, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు, సింహభాగం సీట్లు అని చెప్పిందన్నారు. కులగణన లేకుండా ఇవ్వడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ అక్టోబరు 9న విజయవాడలో మహాధర్నా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ఏపీ అధ్యక్షుడు పరంజ్యోతి, వివిధ జిల్లాల బీసీలు, బీఎస్పీ నాయకులు పాల్గొంటారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

నిస్వార్థం.. సేవే పరమార్థం!

● విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ

● నేడు ఎన్ఎస్ఎస్ డే!

విద్యార్థి దశ నుంచే సేవాభావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించేందుకు జాతీయ సేవా పథకాన్ని (ఎన్ఎస్ఎస్) కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తాము చదువుతున్న కళాశాలలతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, సమాజసేవలో ప్రజలను చైతన్య పరచడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి వెలకట్టలేనిది. ప్రతిఫలం ఆశించకుండా సేవ చేసేందుకు ఎన్ఎస్ఎస్‌లో చేరేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా ఆ సంస్థ సమాజానికి అందిస్తున్న సేవలు, చేస్తున్న కార్యక్రమాలపై ప్రత్యేక కథనం.

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 23 : ఎన్ఎస్ఎస్‌ను 1969 సెప్టెంబరు 24న స్థాపించారు. ఉన్నత చదువులు చదువుతున్న యువతకు చదువు, విజ్ఞానంతోపాటు సమాజం పట్ల బాధ్యత, సేవాగుణం పెంపొందించాలనే లక్ష్యంతో దీన్ని ప్రారంభించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇది నడుస్తుంది. 1958లో గ్రాడ్యుయేట్ విద్యార్థుల ఆలోచనలను పరిగణలోకి తీసుకుని, నాటి కేంద్ర ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన ప్రణాళికలను రూపొందించాలని విద్యామంత్రిత్వ శాఖను కోరింది. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజా ప్రతినిధుల ఆమోదంతో ఎన్ఎస్ఎస్‌ను ప్రారంభించారు. తొలుత 40వేలమందితో ప్రారంభమై నేడు 4 మిలియన్లకుపైగా వలంటీర్లతో సేవలందిస్తున్నది.



వీఎస్‌యూలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు,

● 118 యూనిట్లకు విస్తరణ

జిల్లాలో 2008-09లో ఇది ప్రారంభమై 2024-25 విద్యా సంవత్సరానికి 118 యూనిట్లకు విస్తరించింది. 46 ఇంటర్, 37 డిగ్రీ, 4 పీజీ, 3 పాలిటెక్నిక్ కళాశాలలు కలిపి మొత్తం 90 విద్యాసంస్థల్లో పనిచేస్తుంది. మొత్తం 11,800 మంది వలంటీర్లు ఉన్నారు. ఒక్కో కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకుంటుంది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన గ్రామాలను ఎంపిక చేస్తారు. ఆయా గ్రామాల్లో వారంపాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. విద్యార్థులు రోజూ ఏదో ఒక రూపంలో ప్రజలకు సేవలందించడంతోపాటు ఇంటింటికి వెళ్లి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారు. మూఢ నమ్మకాలపై చైతన్యవంతం చేయడంతో పాటు మొక్కలు నాటి వాటి పరిరక్షణకు ఉన్న ప్రాధాన్యాన్ని వివరిస్తారు. అలాగే తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేస్తారు. వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో పాటు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన, ఓటరుగా నమోదు చేసుకోవడం, ఓటు విలువ తెలియచేయడం చేస్తారు. చదువుకు ఉన్న ప్రాముఖ్యతను తెలియచేసి అక్షరాస్యతను పెంపొందిస్తారు. ప్రధానంగా నషా ముక్త భారత్ అభియాన్, మేరీ మట్టీ మేరా దేశ్, ఏక్ పెడ్ మాకే నామ్, స్వచ్ఛత హీ సేవ వంటి కార్యక్రమాల్లో వలంటీర్లు చురుగ్గా పాల్గొంటారు.



స్వచ్ఛత హీ సేవపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ..



రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటున్న సాత్విక

● అవార్డులు, రివార్డులు

జిల్లాలోని ఎన్ఎస్ఎస్ యూనిట్లు, వలంటీర్లు ఎన్నో రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులు, రివార్డులు పొందారు. గడిచిన విద్యా సంవత్సరాల్లో 37 మంది వలంటీర్లు జాతీయ, రాష్ట్రస్థాయి శిబిరాల్లో పాల్గొని ప్రముఖుల ప్రశంసలందుకున్నారు. వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్ పీ సాత్విక ఉత్తమ వలంటీర్‌గా రాష్ట్రపతి నుంచి అవార్డును అందుకున్నారు. డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వాహకుడిగా అవార్డు తీసుకున్నారు. అలాగే పీ సాయి తేజ ఉత్తమ కార్యక్రమ అధికారి, ఎం పృధ్వీరాజ్, పీ ప్రియ రాష్ట్ర ఉత్తమ వలంటీర్లుగా అవార్డులు దక్కించుకు న్నారు. అలాగే విపత్తుల సమయంలో సహాయ కార్యక్రమాలు నిర్వహించడం, వృద్ధాశ్రమాల సందర్శన, అనాథ పిల్లలకు సహాయం, వరదలు, భారీ వర్షాల సమయంలో పీడిత ప్రాంతాల్లో సేవలందించడం లాంటి ఎన్నో కార్యక్రమాల్లో వీరు పాలుపంచుకుంటున్నారు.



రాష్ట్ర ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఉదయ్‌శంకర్

మరింత బలోపేతం చేస్తాం : ఎస్.విజయభాస్కర్‌రావు, వీఎస్‌యూ వీసీ

జిల్లాలోని ఎన్ఎస్ఎస్ యూనిట్లను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తాం. ప్రతి యూనిట్‌లో వంద మందికిపైగా విద్యార్థులను చేర్చుకుని వారిలో సేవాభావాన్ని పెంపొందిస్తాం. ప్రధానంగా వారిలో వ్యక్తిత్వ వికాసం, కలిసి పనిచేయగలిగే చొరవ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలతోపాటు వ్యక్తిగత జీవితాన్ని మెరుగ్గా తీర్చిదిద్దుకునేందుకు ఎన్ఎస్ఎస్ దోహదం చేస్తుంది. యువత దేశాభివృద్ధికి చేయూతనందించేలా తీర్చిదిద్దుతాం.



కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వేంకటేశ్వరస్వామి చిత్రపటానికి క్షీరాభిషేకం



వేంకటేశ్వరస్వామి పటానికి క్షీరాభిషేకం చేస్తున్న హిందూధర్మ ప్రచార మహాసభ కార్యకర్తలు

సంగం, సెప్టెంబరు 23: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో హిందూధర్మ ప్రచార మహాసభ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి పటానికి సోమవారం సాయంత్రం క్షీరాభిషేకం చేశారు. కలియుగ దైవ ప్రసాదం లడ్డూలో వినియోగించే నెయ్యిని కల్తీ చేయడంతో జరిగిన అపచారాన్ని ఖండిస్తూ వెంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూధర్మ ప్రచార మహాసభ కార్యకర్తలు మాఘం గిరి బాబు, ప్రభాకర్, సురేంద్ర, టీడీపీ నాయకులు కర్నాటి చర ణ్‌రెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ మహా సంఘం సభ్యుల మౌన ప్రదర్శన

కావలి టౌన్, సెప్టెంబరు 23: తిరుమల శ్రీవారి పవిత్ర లడ్డూకు జరిగిన అపవిత్రత అపరాధానికి నిరసనగా మంగళవారం పట్టణంలో మౌన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ మహా సంఘం అధ్యక్షుడు పీవీస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల ప్రాంగణంలో సంఘం సభ్యులతో కలిసి మాట్లాడారు. సాయంత్రం 4గంటలకు ఒంగోల్ బస్టాండ్ వద్ద నున్న పట్టాభిరామస్వామి ఆలయం నుంచి ఈ ప్రదర్శనగా ఆర్డీవో కార్యాలయం వరకు చేపడతామన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక పోటీలు

కావలిటౌన్, సెప్టెంబరు 23: డీఆర్ విశ్వోదయా బాలల దినోత్సవంలో భాగంగా సోమ వారం జేబీ కళాశాలలోని ఎంఏ హాల్‌లో డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు ప్రారంభమయ్యాయి. సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకలో టీడీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు శ్రీదేవి చౌదరి, రాజ్‌కుమార్ చౌదరి, విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, రామ్ సెంటర్ డైరెక్టర్ తాతిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిశ్రీ, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ మాల్యాద్రి, పీడీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

కందుకూరు : యాదవపాలెం, నాంచారమ్మ కాలనీ, బండపాలెం, ముదిరాజ్‌పాలెం ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది మురుగు కాలువలు, వీధులు శుభ్రం చేశారు. కమిషనర్ కె. అనూష ఆదేశాలతో చెత్తను ట్రాక్టర్లతో డంపింగ్‌కు తరలించారు. రోడ్డు మార్జిన్లలో పిచ్చిమొక్కలను తొలగించి దోమల నివారణకు లార్వా మందును పిచికారి చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి ఉన్నారు.

పవన్ దీక్షకు నేతల సంఘీభావం

కావలి, సెప్టెంబరు 23: జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 11రోజుల ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా స్థానిక కచ్చేరి మిట్ట వెంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన జిల్లా కార్యదర్శి సమ్మెన వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ ఉపాధ్యక్షులు గాదంశెట్టి రవి, నాగార్జున, జనసైనికులు పాలడుగు వెంకటేశ్వరరావు, తోకల వెంకటేశ్వర్లు, బాబూరావు, జ్యోతి, భవాని పాల్గొన్నారు.

ఆత్మకూరు విద్యుత్‌శాఖ ఈఈగా శ్రీనివాసులు

ఆత్మకూరు : సబ్ డివిజన్ ఏపీఎస్పీడీసీఎల్ ఈఈగా ఐ శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆయనను సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. విద్యుత్ సమస్యలు ఎదురైతే వినియోగదారులు 9440817594కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. ఆత్మకూరు సబ్ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న బి జనార్ధన్ తిరుపతికి బదిలీ అయ్యారు.

కాలువలో కోళ్ల వ్యర్థాలు



కాలువలో వేసిన కొబ్బరి బోండాలు, కోళ్ల వ్యర్థాలు

పట్టణంలోని ఉదయగిరి రోడ్డు నుంచి పెద్దపవని వెళ్లే రోడ్డు మార్గంలో అటవీ ప్రాంతం, పీజీ సెంటర్ నుంచి వర్షపు నీరు వెళ్లేందుకు వైకుంఠపురం అన్నపుగుంట సమీపంలో ఏర్పాటు చేసిన కాలువలో వ్యాపారులు కొబ్బరిబొండాలు, చికెన్ వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో ఈప్రాంతంలో దుర్గంధం వెదజల్లడంతో పాటు వర్షపు నీరు ప్రవహించేందుకు అడ్డుగా ఉంటున్నాయి. వరద నీరు ఎక్కువగా వస్తే రోడ్డుపై పారుతోందని స్థానికులు వాపోతున్నారు. మురుగునీటి కాలువలు, రోడ్డు మార్జిన్‌లో వ్యర్థాలు వేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- కావలి రూరల్

నిరుపయోగంగా ఓవర్ హెడ్ ట్యాంక్

మండలంలోని చినక్రాక వద్ద 14వ మైలు సెంటర్‌లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. సమీపంలోని చెరువు నుంచి సోమశిల జలాలను శుద్ధి చేసి పంపింగ్ చేసి పైపులైను ద్వారా గ్రామాల్లోని ట్యాంకు మళ్లించేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం నిలిపివేయడంతో ఓవర్‌హెడ్‌ట్యాంకు నిరుపయోగంగా మారింది. పథకంను వినియోగంలోకి తీసుకవచ్చేలా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- జలదంకి



ఇలా ఉంటే ఎలా వెళ్లేది ?



చిల్లచెట్లతో మూసుకుపోయిన రాళ్లపాడు ప్రాజెక్టు బీబీరోడ్డు

రాళ్లపాడు ప్రాజెక్టు నుండి ప్రాజెక్టు కార్యాలయం, అతిథి గృహానికి వెళ్లే రోడ్డు చిల్లచెట్లతో మూసుకుపోయింది. వరదలు వచ్చిన అత్యవసర సమయాల్లో ప్రాజెక్టు వద్దకు చేరేందుకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వచ్చినా అతిథిగృహానికి ఈరోడ్డులోనే వెళతారు. ఏడాది నుండి చిల్ల చెట్లను తొలగించక పోవడంతో అధికారులు, సిబ్బంది తాతాహోటల్ మీదుగా చుట్టూ తిరిగి కార్యాలయాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– లింగసముద్రం

ఉచిత ఇసుక అందుబాటులో ఉండాలి

● సీఐటీయూ నిరసన



ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

ఆత్మకూరు, సెప్టెంబరు 23: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులోకి తెచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని సోమ వారం ఆత్మకూరులో సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భవన నిర్మాణ కార్మికులు, సీఐటీయు అనుబంధ విభాగాల కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐటీయు నాయకుడు ఆత్మకూరు నాగయ్య మాట్లాడుతూ ఉచిత ఇసుక ఆత్మకూరు ప్రజలకు అందుబాటులో లేదని, ఆత్మకూరు నుంచి సుమారు 20 కి.మీ దూరంలో ఉన్న మర్రిపాడు, సంగం డంపింగ్ యార్డ్‌ల వద్దకు వెళ్లి ఇసుక తెచ్చుకోవాలంటే భారంగా ఉందని, ఆత్మకూరు సమీపంలో ఉన్న పెన్నానది నుంచి కూడా ఇసుక తెచ్చుకోలేకపోతున్నారన్నారు. ఈమేరకు వారు ఆర్డీవో మధులతకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, జిల్లా భవన కార్మికుల కార్యదర్శి ఏ గోపాల్ పాల్గొన్నారు.

ఆశావర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి



కలిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

కలిగిరి, సెప్టెంబరు 23: రావులకొల్లు దళిత ఆశావర్కర్ పందిటి విజయమ్మను విధుల్లోకి తీసుకోవాలని సోమవారం మండల ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. ఈ విషయంపై పట్టణంలోని కలిగిరమ్మ గుడి సర్కిల్ నుండి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి విచారణ చేపట్టకుండా సర్పంచ్ తీర్మానంతో ఆశావర్కర్‌ను తొలగించడం అన్యాయం అన్నారు. అనంతరం తహసీల్దారు రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య, మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయక్రిష్ణ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిట అంబేద్కర్, మందా సుజాత మద్దతు పలికారు. కార్యక్రమంలో నందిపోగు వెంగళరావు, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు అరుణ, మేరి, గౌసియా, అంజమ్మ, సుభాని, భార్గవి, మంజుల పాల్గొన్నారు.

విజన్ 2047పై ప్రజల సూచనలు సేకరించాలి

ఏఎస్ పేట, సెప్టెంబరు 23: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన స్వర్ణాంధ్ర విజన్ 2047పై ప్రజల సూచనలు, సలహాలు సేకరించాలని ఎంపీడీవో శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి రాష్ట్ర అభివృద్ధికి తగిన సూచనలు ప్రజల నుండి స్వీకరించి మండల ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ పద్మావతి

కావలి టౌన్, సెప్టెంబరు 23: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిచడమే తమ లక్ష్యమని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి తెలిపారు. సోమవారం ఏరియా వైద్యశాల ప్రాంగణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ హెల్త్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య భద్రతా శిబిరం ఏర్పాటు నిర్వహించారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రత కోసం ఈప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగులను మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేశారు. బీజేపీ నేతలు శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, ఐఎంఏ గౌరవాధ్యక్షుడు బెజవాడ రవికుమార్, వైద్యులు కర్నాటి రోహిత్, చైతన్య, వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు లక్ష్మీ, పబ్బాసాయి పాల్గొన్నారు.

పాఠశాలలో సింక్‌ల ధ్వంసం



ధ్వంసం చేసిన సింక్‌లు

సంగం : ఆకతాయిలు బరితెగించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బాలుర టాయిలెంట్ గదిలో ఏర్పాటుచేసిన సింక్‌లను ధ్వంసం చేసి బయట పడేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గుర్తించి ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఆటలాడటానికి వచ్చిన ఆకతాయిలు ఈ పనికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. ధ్వంసం చేసిన సింక్‌ల విలువ రూ. 50 వేల వరకు ఉంటుందని ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్రామ స్వరాజ్యానికి నాంది పలకాలి



వ్యర్థాలతో రూపొందించిన వస్తువులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వరికుంటపాడు, సెప్టెంబరు 23: మండలంలోని వేంపాడులో సోమవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మల్లికార్జున మాట్లాడుతూ నివాసాల నుంచి సేకరించిన వ్యర్థ పదార్థాలతో వస్తువులు తయారుచేసి గ్రామ స్వరాజ్యానికి నాంది పలకాలన్నారు. అనంతరం మొక్కలు నాటి గ్రామ నమూనాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సికిందర్, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **ఉదయగిరి రూరల్ :** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రీన్‌అంబాసిడర్స్, గ్రీన్‌గార్డుల కుటుంబ సభ్యులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనీషా, శివరాం, ఠాగూర్, రజిత, మధుమోహన్, బీజేపీ నాయకులు కదిరి రంగారావు, నెల్లూరు వెంకటస్వామి, చుండి హరిగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేతల పరామర్శ

వలేటివారిపాలెం : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అయ్యవారిపల్లె తాతామనువడు ఉప్పుటూరి పెదకొండపనాయుడు, దినేష్‌ల మృతదేహాలకు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, నెల్లూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

అల్లుకున్న తీగల తొలగింపు

వలేటివారిపాలెం : స్థానిక జాతీయ రహ దారి సమీప పొల్లాల్లో విద్యుత్ కరెంట్ స్తంభా లకు అల్లుకున్న తీగలు సోమవారం ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించారు. ఈ సమస్యపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి వారు స్పందించడంతో స్థానికులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అల్లుకున్న తీగలను తొలగిస్తున్న సిబ్బంది

ప్రజలు మెచ్చేలా ప్రభుత్వ పాలన : మంత్రి ఆనం



ఆత్మకూరు: బహిరంగసభలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి ఆనం



కందుకూరు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఆత్మకూరు, సెప్టెంబరు 23 : రాష్ట్రంలో అధికారం చేపట్టిన ప్రజా కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన ప్రజలు మెచ్చేలా సాగిందని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని 22 వార్డు పేరారెడ్డిపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలు, స్టికర్లు అందజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగసభలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విజయవాడ నగరం వరదల్లో విలవిల్లాడుతున్నప్పుడు ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమించి అండగా నిలిచారన్నారు. రూ. 2000 కోట్లు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. అయినా నిధులకు వెనకాడకుండా వరద బాధితలను ఆదుకున్నామని వివరించారు. ఈ కార్య క్రమంలో ఆర్డీవో కె మధులత, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఎస్‌డీసీసీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, నెల్లూరు పార్లమెంటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ మాదాల శ్రీనివాసుల నాయుడు, కాంరెడ్డి రవీంద్రరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ పలువురు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

ఏకనాయకత్వంతో పనిచేయాలి : ఎమ్మెల్యే కాకర్ల

కొండాపురం: గ్రామ పంచాయతీల్లో ఏకనాయకత్వం కింద పనిచేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. సోమవారం మండలకేంద్రంలో మాజీ వైస్ ఎంపీపీ పోలినేని చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీడీపీ నాయకులతో కలసి గుడవళ్లూరులోని దుకాణాలు, ఇళ్లకు వెళ్లి కరపత్రాలను, స్టిక్కర్లను అందజేశారు. స్థానిక బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన సమా వేశంలో మాట్లాడారు. పంచాయతీలో సమస్యలు తీర్చాలని గుడవళ్లూరు సర్పంచ్ మాచర్ల ఆయనను కోరారు. మండల అభివృద్ధిలో భాగంగా పంచాయతీల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు మ్యాచింగ్ గ్రాంటు కింద ప్రతి పంచాయతీకి రూ.25 నుంచి రూ.50వేల వరకు సొంత నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు టీడీపీ కన్వీనర్ ఎమ్ ఓంకారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు, టీడీపీ సీనియర్ నాయకులు పోలినేని పెదమాల కొండయ్య, చినమాల కొండయ్య విగ్రహాలను మండలకేంద్రంలో ఏర్పాటుకు కృషిచేయాలని నాయకులు కోరారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

కలిగిరి నుండి మండలం మీదుగా వల్లేటివారిపాలెం మండలం వరకు మంజూరైన రెండు లైన్ల రహదారి పనులకు స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ చెంచలబాబు యాదవ్, యారవ క్రిష్ణయ్య, పోలినేని రమేష్, గంటా లక్ష్మీనరసింహులు, దామా మహేశ్వరరావు, దాసరి అశోక్, చెరుకూరు వెంకటాద్రి, బొట్లగుంట హరిబాబు, నర్రా చెంచు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

●**దుత్తలూరు(ఉదయగిరి రూరల్) :** మండలంలోని జంగాలపల్లి గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.20 లక్షలతో నాలుగు రోడ్ల నిర్మాణానికి సోమవారం రాత్రి శిలాఫలకాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, సీనియర్ టీడీపీ నాయకులు మల్లంపాటి గువరయ్యనాయుడు, వెంగళరెడ్డి, పీఆర్ ఏఈ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.



దుత్తలూరు (ఉదయగిరి రూరల్) : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కాకర్ల

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు: పెదమోపాడులో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన ప్రజావేదికలో ప్రజలు సమస్యలపై వినతులు అందజేశారు. నియోజకవర్గంలో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.1.5 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం ఐసీడీఎస్ పౌష్టికాహార మాసోత్సవాల లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దారు ఇక్బాల్, సర్పంచ్ పరిమళపాల్, నియోజకవర్గ పరిశీలకులు కుసుమ కుమారి, తోకల వెంకటేశ్వర్లు, రావుల రవి, తన్నీరు ఏడుకొండలు, తన్నీరు శ్రీను, రాయపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డెల్టాగా మార్చేందుకు కృషి : ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

బిట్రగుంట: బోగోలు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి హాజరయ్యారు. జిల్లా మంత్రుల సహకారంతో వచ్చే ఏడాదికి నాలుగు మండలాలను డెల్టా ప్రాంతంగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. రైల్వే ఎల్సీగేట్ 144తో బోగోలు మండల ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి ఎంపీ వేమిరెడ్డితో కలిసి రైల్వే అధికారులతో కుమ్మర వీధిలోని రైల్వే ఎల్సీగేట్ 143 వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు, మాజీ సోమశిల కమిటీ అధ్యక్షుడు కండ్లగుంట మధుబాబు నాయుడు, నేతలు ముంతాల వెంకయ్య, సర్పంచు అనిత, పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు అరుణమ్మ, మాజీ ఉపసర్పంచు అంజయ్య యాదవ్, సుధీర్‌బాబు, ప్రభాకర్, నాగరాజు, వరప్రసాద్, తిరుమలేష్, రఘురాంనాయుడు ఉన్నారు.



బిట్రగుంట: రైతులకు విత్తనం వడ్లు అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

సీఎం సహాయ నిధికి విరాళం

అనంతసాగరం, సెప్టెంబరు 23: మండలంలోని కొత్తపల్లి మాజీ సర్పంచులు చల్లా చంద్రశేఖరరెడ్డి, చల్లా పద్మమ్మలు విజయవాడ వరద బాధితులకు చేయూత నందించారు. సోమవారం ఆత్మకూరుకు విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి రూ. 40వేల చెక్కును సీఎం సహాయ నిధికి అందించారు.

● **కందుకూరు:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్కంధపురి లారీఓనర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.1,01,116 విరాళంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల వేదికకు 8 వినతులు

కందుకూరు : స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 8 వినతులు వచ్చాయని కమిషనర్ అనూష తెలిపారు. ఈ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్ల సమస్యల పరిష్కారానికి సెల్: 91777 00267 నెంబరుకు ఫోన్‌చేసి తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అల్లూరు ఎంపీడీవోకి సన్మానం

అల్లూరు : బదిలీపై వెళుతున్న ఎంపీడీఓ జ్యోతిని సోమవారం కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. మండల ప్రజలతో తనకు ఏర్పడిన అనుబంధం మరువలేనిదన్నారు. ప్రతిఒక్కరూ సహకారాన్ని అందించడంతోనే సమస్యలు లేకుండా విధులను నిర్వర్తించానన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, అన్నిశాఖల ఏఈలు, పంచాయతీల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

అనంతసాగరం : గోవిందమ్మపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నూలు విజయ్‌కుమార్ (46) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆయన భౌతిక కాయాన్ని ఎంఈవో 2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సందర్శించి సంతాపం తెలిపారు. విజయ్‌కుమార్ మృతికి ఉపాధ్యాయులు, పలు సంఘాల నేతలు సంతాపం తెలిపారు.

వాగు ఆక్రమిస్తున్నారని గ్రామస్థుల ఆందోళన

కలువాయి, సెప్టెంబరు 23 : వెదనపర్తి చెరువు కలుజు నీరు వెళ్లే తూర్పు వాగును కొందరు మట్టితో పూడ్చి ఆక్రమిస్తున్నారని సోమవారం గ్రామస్థులు పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. వెదనపర్తి చెరువు కలుజు పారినప్పుడు తూర్పు వాగు ద్వారా ఆ నీరంతా గోపవరం చెరువుకు చేరుతుంది. ఈ వాగు పక్కన పొలం ఉన్న గోపవరం గ్రామానికి చెందిన కొందరు దాన్ని పూడ్చి వారి పొలంలో కలుపుకుంటున్నారని వారు తెలిపారు. చెరువు కలుజు నీరు వెళ్లే ఈవాగును పూడ్చితే ఆ నీరంతా తమ పొలాలపై పడి మునిగిపోతాయని వెదనపర్తి గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈవిషయం రెవెన్యూ అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై ఆర్ఐ మస్తాన్‌వలీ మాట్లాడుతూ గ్రామ తలారిని పంపి వాగు పూడ్చే పనులు నిలిపివేసినట్లు తెలిపారు.

బోరు పాయింట్ ఏర్పాటు

సంగం, సెప్టెంబరు 23: స్థానిక రాళ్లచెలిక కాలనీకి తాగునీటి సరఫరాకు ఎర్రచెరువు ప్రాంతంలో సోమవారం బోరు పాయింట్ వేశారు. కాలనీకి తాగునీరు సరఫరా అయ్యే మోటారు నాలుగు రోజుల కిందట మరమ్మతులకు గురైంది. దీంతో కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతుండడంతో నూతన బోరు పాయింట్ వేయించారు.

గంధ మహోత్సవం గోడపత్రిక ఆవిష్కరణ

అనంతసాగరం, సెప్టెంబరు 23: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ మష్కుర్ అలిషా ఖాదరీ దర్గా 14వ గంధమహోత్సవ గోడ పత్రికను సోమవారం మంత్రి ఆనంచేతుల మీదుగా ఆవిష్కరించారు. వేడుకలకు హాజరు కావాలని దర్గా నిర్వాహకులు మంత్రిని కోరారు. కార్యక్రమంలో సానిసాహెబ్, మాజీద్‌సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి ఎంపీడీవో బదిలీ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 23: ఉదయగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి దేవరకొండ ఈశ్వరమ్మ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. అధికారులు ఆమె స్థానంలో ఇంకా ఎవర్నీ నియమించలేదు. అలాగే తహసీ ల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, పలువురు వీఆర్వోలు ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా వారి స్థానంలో అధికారులు కొత్తవారిని నియమించారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

నెయ్యి కల్తీపై 'సుప్రీం' జడ్జితో విచారణ జరిపించాలి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 23 : శ్రీవారి లడ్డూకు వినియోగించే నెయ్యి కల్తీపై సిట్ కాకుండా సుప్రీం కోర్టు న్యాయమూర్తితో, లేదా సీబీఐతో విచారణ జరిపించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జిల్లా కార్యదర్శి, సీపీఐ నగర కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెయ్యిలో జంతు సంబంధిత కొవ్వును కలిపారని సీఎం చంద్రబాబునాయుడు ఆరోపించినది నిజమైతే నేరస్థులను కచ్చితంగా శిక్షించాలని పేర్కొన్నారు. కల్తీ వ్యవహారంలో కొన్ని కోట్ల మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని తెలిపారు.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా ?

టీపీ గూడూరు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కంచె లేకుండా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏంజరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నాయి. ఈదూరు హైస్కూల్ ఎదురుగా విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు చుట్టుకొని వేలాడుతున్నాయి. దీంతో విద్యార్థులు భయం భయంగా కాలం గడుపుతున్నారు. వెంకన్నపాలెం, ఈదూరు, పొట్లపూడి, చింతోపు, కోడూరు తదితర గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయలేదు. ఆయా గ్రామాలవారు విద్యుత్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. ప్రమాదాలు జరగ్గముందే కంచెలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రక్షణ కంచె లేకుండా పల్లెల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- తోటపల్లిగూడూరు

పాలిటెక్నిక్ భవనాలు బాగు చేయండి

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 23 : ఎంతో చరిత్ర కలిగిన వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల భవనాలను బాగుచేసి, వసతులు కల్పించాలని కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలోని మంత్రి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందచేశారు. 1962లో ప్రారంభించిన ఈ కళాశాల శిథిలావస్థకు చేరుకుందని, వరదలు, తుఫానులు వచ్చిన సమయంలో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించి మంత్రి ప్రభుత్వ పెద్దలతో చర్చించి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.రామ్‌ప్రసాద్, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు డి.ప్రభాకర్‌రావు, కార్యదర్శి డి.శివకుమార్, సభ్యులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి ఆనంతో పాలిటెక్నిక్ కళాశాల ప్రతినిధులు

ఎవరు రెచ్చగొట్టినా.. రెచ్చిపోను!

- చట్టం తనపని తాను చేసుకుపోతుంది
- రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ



కరపత్రాలు అందజేస్తున్న మంత్రి నారాయణ, కోటంరెడ్డి, కమిషనర్

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 23 : తనను ఎవరు ఎంతగా రెచ్చగొట్టినా తాను రెచ్చిపోనని, చట్టం తనపని తాను చేసుకుపోతుందని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని 52వ డివిజన్‌లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యాక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో జగన్ పిచ్చితుగ్లక్ పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. తమకు వ్యతిరేకంగా 13 జీవోలు తెచ్చిందని, ఈ విషయాలపై కోర్టుకు వెళ్లడంతో తమకు న్యాయం జరిగిందన్నారు. చట్టపరంగా నిర్వహించే ఎలాంటి సంస్థలైనా, విద్యాసంస్థలైనా నడుపుకోవచ్చని తెలిపారు. సింపురి ప్రజల రుణం తీర్చుకునేలా అన్ని రంగాల్లో స్వచ్ఛమైన నెల్లూరుగా అభివృద్ధి చేసి చూపించడమే తన లక్ష్యమన్నారు. తిరుమల లడ్డూ విషయంలో ప్రభుత్వం సిట్ విచారణకు ఆదేశించిందని చెప్పారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ దేవుడు లాంటి మంత్రి నారాయణను విమర్శించేందుకు మాజీ మంత్రి అనిల్‌కు నోరెలా వచ్చిందన్నారు. ఎన్నికల తర్వాత ప్రజలను వదిలేసి వెళ్లిన నీవా నీతులు మాట్లాడేది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మా జోలికి వస్తే మేమెంటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మొక్కలకు గార్డ్సు ఏర్పాటు చేయాలి

- నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 23 : నాటిన మొక్కలను కాపాడుకునేందుకు ట్రీగార్డ్సును ఏర్పాటు చేయాలని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ సూచించారు. సోమవారం 20వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, కావేరి అవెన్యూ ప్రాంతాల్లో నాటిన మొక్కలకు ఏర్పాటు చేసిన ట్రీగార్డ్సును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటారన్నారు. వీటన్నిటిని కాపాడుకునేందుకు గార్డ్సు తప్పనిసరన్నారు. 'ఏక్ పేడ్ మాకే నామ్' అనే ఆశయంతో ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత వహిస్తూ మొక్కలు నాటాలన్నారు. కాగ ఎన్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏడీసీ శర్మద నగర వాసుల నుంచి వినతులు స్వీకరించారు.



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

అఖిలభారత చెస్ విజేత ఆదిత్యవరుణ్

నెల్లూరు (విద్య) : నెల్లూరులో జరుగుతున్న వైవీ రమణారెడ్డి స్మారక అఖిలభారత ఓపెన్ చెస్ పోటీల్లో ఫిడే చెస్ మాస్టర్ ఆదిత్యవరుణ్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఏపీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలు హోరాహోరీగా సాగాయి. మొత్తం ఏడు రౌండ్లలో జరిగిన ఈ పోటీలలో విశాఖకు చెందిన ఫిడే చెస్ మాస్టర్ ఆదిత్యవరుణ్ ప్రథమస్థానం, హైదరాబాద్‌కు చెందిన భరత్‌కుమార్‌రెడ్డి ద్వితీయ, చెన్నైకు చెందిన హరి మాధవన్ తృతీయ స్థానం సాధించారు. విజేతలకు రూ.2.25 లక్షల నగదుతోపాటు పలు విభాగాల్లో క్రీడాకారులకు సైకిళ్లు, స్మార్ట్ వాచీలు, ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ హోమ్స్ ఛైర్మన్ సుప్పనాచారి, తిరుపతి కార్పొరేటర్, చెస్ క్రీడాభిమాని శేఖర్‌రెడ్డి, చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.సుమన్, టోర్నీ డైరెక్టర్స్ ఎస్.వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి, వినయ్, హైకోర్టు న్యాయవాది శ్రీహరి పాల్గొన్నారు.



రూరల్ ఎమ్మెల్యేతో కార్పొరేటర్ల భేటీ

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 23 : నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో సిటీ నియోజకవర్గం పరిధిలోని 6, 10 డివిజన్ల కార్పొరేటర్లు మద్దినేని శ్రీధర్, కిన్నెర ప్రేమ్‌కుమార్‌లు సోమవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, కార్పొరేటర్లు పార్టీల మార్పుపై చర్చించారు. మూడవసారి రూరల్లో గెలిచి హ్యాట్రిక్ సాధించినందుకు శ్రీధర్‌రెడ్డిని వారు సన్మానించారు.

అవినీతి, లంచాలకు కేరాఫ్ అనిల్

- డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్

నెల్లూరు(వ్యవసాయం) : అవినీతి, లంచాలకు కేరాఫ్ అడ్రస్ మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అంటూ డిప్యూటీ మేయర్, టీడీపీ నేత రూప్‌కుమార్ యాదవ్ మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పశువుల సంత వద్ద కూడా లంచాలు తీసుకున్న దరిద్రుడని, పార్టీ కోసం 15ఏళ్లు కష్టపడి పనిచేసిన ఓ దళిత వ్యక్తి బిడ్డకు షిఫ్ట్ ఆపరేటర్ పోస్టును రూ.7లక్షలకు అమ్ముకున్న ఘనుడు అనిల్ అంటూ ఆరోపణలు చేశారు. ఏదో పొడుస్తా అంటున్నావు కదా.. నికార్సయిన రాజకీయ నాయకుడివి అయితే ఇప్పుడు నెల్లూరులో రాజకీయం చేయాలంటూ సవాల్ విసిరారు. అధికారం ఉన్నప్పుడే ఏమీ చేయలేకపోయావని ప్రస్తుతం ఇన్‌ఛార్జి పదవి కూడా దక్కలేని నువ్వు ఏం చేయగలవని హేళన చేశారు. వైసీపీకి వెన్నుపోటు పొడిచిన మొదటి వ్యక్తి జిల్లాలో అనిల్ అని సిటీలోని కార్పొరేటర్లను జనసేనలోకి వెళ్లమని చెప్పడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఖలీల్ అహ్మద్‌ను వైసీపీ నగర ఇన్‌ఛార్జి పదవి నుంచి తొలగించి చంద్రశేఖర్‌రెడ్డికి బాధ్యతలు ఎందుకు అప్పగించారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు దార్ల వెంకటేశ్వర్లు, ఇంతియాజ్, నాగరాజు, మైనుద్దీన్, సుజాత, నిశ్చల్ కుమార్‌రెడ్డి, అశోక్, జనార్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూప్‌కుమార్ యాదవ్

మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు అరికట్టాలి

- డీకేడబ్ల్యూ కళాశాల అధ్యాపకురాలు భారతి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 23 : పనిచేసే ప్రదేశాలలో మహిళా ఉద్యోగులపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టాలని డీకేడబ్ల్యూ కళాశాల అధ్యాపకురాలు భారతి పేర్కొన్నారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో లైంగిక వేధింపులపై జరిగిన జిల్లా సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక చట్టాలు, హక్కులు ఉన్నాయన్నారు. అయితే అవి పూర్తిగా అమలు కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల్లో మార్పులు రావాలని, ఆడపిల్లను కుటుంబంలో తక్కువ చేసి చూడరాదన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ సినిమాల్లో, సీరియల్‌లలో మహిళలను ఆటవస్తువుగా చూపించి భరతమాతను అగౌర్వపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మహిళలకు గౌరవం లేకుండా పోతుందని, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ దుగ్గిరాల అన్నపూరమ్మ, జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది!

మనుబోలు, సెప్టెంబరు 23: మండలంలో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి జహీర్ సోమవారం తెలిపారు. ప్రతి మంగళ, బుధవారాల్లో రెండేసి పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రైతులు తప్పక హాజరుకావాలని కోరారు.

సాంకేతికతో లాభసాటిగా వ్యవసాయం

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 23 : ఆధునిక సాంకేతిక పద్ధతులతో రైతులు వ్యవసాయం చేస్తే లాభసాటిగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి శిరీష తెలిపారు. మండలంలోని నరుకూరు, పేడూరు గ్రామాల్లో సోమవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆము మాట్లాడుతూ రైతులకు పంటల సాగులో సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమరసతా సాధనకు కవుల కృషి

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 23: సమాజంలో సమరసతా సాధనకు కవులు గుర్రం జాషువా, బోయి భీమన్నలు విశేష కృషిచేసినట్లు వక్తలు కొనియాడారు. మండలంలోని చెన్నపల్లిపాలెం జడ్పీ హైస్కూల్‌లో సోమవారం గుర్రం జాషువా, బోయి భీమన్న జయంతుల సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, మెమొంటోలు అందజేశారు. సైన్స్ ఉపాధ్యాయురాలు ఏ.విద్యాధరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.సాయిప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ ఆత్మకూరు ఠాగూర్, సామాజిక సమరసతా మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి గోళ్ల కేశవులు, సాహితీ ప్రతినిధి వీ.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

వెంకటాచలం: మండలంలోని కందలపాడులో సోమవారం స్వర్ణభారత ట్రస్టు, మండవ ఫౌండేషన్, పశు సంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కనుపూరు పశు వైద్యాధికారిణి ఎస్.సుష్మ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సృష్టికర్త చంద్రబాబు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 23 : సంక్షేమ పథకాల సృష్టికర్త సీఎం చంద్రబాబు నాయుడని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని నిడుముసలి గ్రామంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో చేయగలిగే ఏకైక సీఎం చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన కాలువల పూడికతీతను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, వీరేంద్ర నాయుడు, రూప్ కుమార్ యాదవ్, కమలాకర్‌రెడ్డి, షేక్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు : స్థానిక దొమ్మరపాళెం సాయిబాబా మందిరంవీధిలో 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను ఇంటింటికీ తిరిగి అతికించారు. టీడీపీ నాయకుడు నాటకరాని వెంకట్ ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శి కుసుమలత పాల్గొన్నారు.

విడవలూరు : పార్లపల్లి, అన్నారెడ్డిపాళెం పంచాయతీల్లో సర్పంచులు రామిశెట్టి స్వాతి, బండ్ల కవిత సోమవారం పర్యటించారు. ఇంటింటి కీ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, సుజితా, టీడీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ, బండ్ల గోవర్ధన్, మడపర్తి చరణ్, మోహన్ పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

పునరుద్ధరిస్తే ప్రయోజనమే కదా!

గతంలో బాటసారులు తలదాచుకునేందుకు బుచ్చి మండలం పెనుబల్లి గిరిజనకాలనీ సమీపంలో రాతి మండపాన్ని నిర్మించారు. ఈ మండపానికి ఓ ప్రత్యేకత కూడా ఉంది. జొన్నవాడ కామాక్షితాయి బ్రహోత్సవాలప్పుడు, ఇతర పర్వదినాల్లో పెనుబల్లికి వెళ్లే ముందు అమ్మవారు ఇక్కడ సేదతీరేవారు. మొదట నైవేద్యం అందుకునేవా రు.ఈ ఆనవాయితీ ఏడేళ్ల క్రితం వరకు కొనసా గింది. అయితే ఈ మండపం కూలేస్థితికి చేరడంతో ఆ సంప్రదాయం కొనసాగడంలేదు. ఈ మండపానికి మరమ్మతులు చేస్తే ఎంతోమందికి ప్రయాజనకరంగా ఉంటుంది. - బుచ్చిరెడ్డిపాళెం



వరద బాధితులకు విరాళం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు23: విజయవాడ వరద బాధితుల కోసం బుచ్చిలోని రెయిన్‌బో స్కూలు విద్యార్థులు విరాళాలు సేకరించారు. వచ్చిన మొత్తం రూ. 50,060 లను సోమవారం కరస్పాండెంట్, హెచ్ఎంలు ఎంఈవోలు ఎం. దిలీప్‌కుమార్, పీవీ. రత్నంలకు చెక్కు రూపంలో అందచేశారు. విరాళాల సేకరణలో బచ్చు రక్షిత, బీ. అక్షజ్‌రెడ్డి, పీ హర్షిత్, హర్షవర్ధన్, టీ జాయ్, శ్రీహిత, అఖిల్, సీహెచ్ మోక్షిత, కే.మోక్షిత ఉన్నారు. వారిని ఎంఈవోలు అభినందించి బహుమతులిచ్చారు.



విరాళాల చెక్కును ఎంఈవోకి అందచేస్తున్న విద్యార్థులు

పేద విద్యార్థులకు ఆర్థికసాయం

బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక పె ద్దూరులోని గోపాలకృష్ణయ్య స్కూలులో ఇద్దరు విద్యార్థుల చదువుకు బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ (బీఎఫ్ఏ) నిర్వాహకులు సోమవారం రూ. 18వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కే. పరశురామయ్య, కరస్పాండెంట్ శ్రీధర్, వెంకటరమణ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా అనీల్‌కుమార్

మనుబోలు, సెప్టెంబరు 23: మండల ట్రాన్స్‌కో ఏఈగా పనబాక అనీల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏఈగా ఉన్న రవికుమార్‌రెడ్డి ఏడీగా పదోన్నతిపై వెళ్లడంతో అప్పటినుంచి సబ్‌ఇంజనీర్ నాగార్జున ఇన్‌చార్జ్ ఏఈగా ఉన్నారు. విద్యుత్‌భవన్‌లో ఉన్న అనీల్‌కుమార్ బదిలీల్లో బాగంగా మనుబోలు ఏఈగా బాధ్యతలు తీసుకున్నారు.

- డీటీగా బషీర్

డీటీగా ఎస్‌కే. బషీర్ బాధ్యతలు తీసుకున్నారు. మండలంలో డీటీగా పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి జీపీడీ కింద వెళ్ళడంతో రీసర్వే తహసీల్దార్ శివప్రసాద్ డీటీగా వ్యవహరించేవారు. ఆయన బదిలీపై వెళ్లడంతో బషీర్‌ను నియమించారు.

గ్రాండ్ పేరెంట్స్ వేడుకలు

ముత్తుకూరు, సెప్టెంబరు 23: కృష్ణపట్నం పోర్టులోని అదానీ వరల్డ్‌స్కూల్‌లో సోమవారం గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ఎస్ సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులు వారి తాత, నానమ్మ, అమ్మమ్మలకు పాదపూజ చేసి ఆశీస్సులు పొందారు. ఆట, పాటలతో నూతన ఉత్తేజాన్ని నింపారు. చిన్న పిల్లల పద్యాలు, శ్లోకాలతో పాటు విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఉషాసునీత, శ్రీవాణి, మౌనిక, అకడమిక్ హెడ్ రాజు పాల్గొన్నారు.

చిత్రపటాల పంపిణీ

పొదలకూరు: మండలంలోని నల్లపాళెం గ్రామ సచివాలయానికి టీడీపీ నాయకులు పార్లపల్లి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చిత్రపటాలను అందచేశారు. నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 23 : నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్, ఒక ఎక్స్‌కవేటర్‌ను రూరల్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో నేలటూరు పునరా వాస కేంద్రానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా ఇసుక తవ్వి తరలి స్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఇసుకను స్థానిక వైసీపీ నేత గృహ నిర్మాణానికి తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ నేత మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి స్వయాన మామ కావడంతో ఈ ఘటన చర్చనీయాంశమైంది.

రుణాల చెల్లింపు సకాలంలో జరిగేలా చూడాలి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు23: పొదుపు మహిళలకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించడంతోపాటు వాటిని సకాలంలో చెల్లింపు జరిగేలా చర్యలు చేపట్టాలని స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం లలితారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్త్రీనిధి, పొదుపు గ్రూపుల రుణాలు, చెల్లింపులు, రికార్డుల నమోదు విషయాలపై సంఘబంధం అధ్యక్షులు, వీవోఏలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సీసీలు ఉమామహేశ్వరి, షేక్ ఖాజా మస్తాన్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 23: వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ కోరారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రాయశ్చిత పూజలు చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. నాయకులు గునుకుల కిషోర్, లాయర్ శ్రీరామ్, కృష్ణారెడ్డి, జమీర్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న జనసేన నాయకులు

లడ్డూ కల్తీచేసిన వారికి ఉరిశిక్ష వేయాలి

ముత్తుకూరు: శ్రీవారి లడ్డూను కల్తీచేసిన వారిని ఉరితీయాలని సర్వేపల్లి నియోజకవర్గ జన సేన్హ సమన్వయకర్త బీ సురేష్‌నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముత్తుకూరులో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి దారుణాలు ఎన్నో చోటు చేసుకున్నాయన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడంతో పాటు, కలియుగ దైవమైన శ్రీవారి ప్రాంగణాన్ని భ్రష్టు పట్టించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రహీమ్, అశోక్, సుమన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా పేలుళ్ల బాధితులకు ఆర్థిక సాయం

మనుబోలు, సెప్టెంబరు 23: స్థానిక బీసీ కాలనీలోని బాణసంచా పేలుళ్ల బాధితులకు సోమవారం టీడీపీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రూ.లక్ష ఇవ్వగా, పలువురు టీడీపీ నాయకులు రూ.3లక్షలు వేసుకుని బాధితులకు అందజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి రూ. 10వేలు, గాయపడిన వారికి రూ. 5వేలు, దెబ్బతిన్న ఇళ్లకు తగిన ఆర్థిక సాయాన్ని టీడీపీ గ్రామ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెల్లగిరి ప్రసాద్, అమీర్‌భాషా, దండు చంద్రశేఖర్ రెడ్డి, పచ్చిపాల చంద్రశేఖర్‌రెడ్డి, ఏకాంబరం సుబ్బయ్య పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకులు

ఆరోగ్య జీవనానికి పరిశుభ్రత ముఖ్యం

పొదలకూరు, సెప్టెంబరు 23: ఆరోగ్యకరమైన జీవనశైలికి పరిశుభ్రత ముఖ్యమని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రసాద్ అన్నారు. సోమవారం కూటమి నాయకులతో కలిసి స్వచ్ఛతాహిసేవలో భాగంగా సఫాయి మిత్ర ఆరోగ్య భద్రత శిబిరాన్ని ప్రారంభించారు. రోగులకు, స్థానికులకు పరిశుభ్రతపై, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్యసిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉచితంగా ఇసుక ఇవ్వాలని ధర్నా

కోవూరు, సెప్టెంబరు23: ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక అందివ్వాలని సోమవారం భవన నిర్మాణ కార్మికులు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా నాయకుడు చాంద్‌బాషా మాట్లాడుతూ ఇసుక ధర ఎక్కువుగా ఉండటం, అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణాలు నిలిచి పోయాయన్నారు. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, రూ.6,000 పింఛను ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. కార్మిక సంఘం నాయకులు చిరంజీవి, హరి, అఫ్రోజ్, సురేష్ బాబు, జయరామిరెడ్డి, కుమార్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు



తిరుమలలో శాంతి హోమం

శ్రీవారి లడ్డూప్రసాదాల్లో వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసి పవిత్రత దెబ్బతిన్నదనే అభిప్రాయాలకు మేరకు టీటీడీ పరిహారం కోసం సోమవారం శాంతి హోమం నిర్వహించింది. సంప్రోక్షణ నిర్వహించి పవిత్రతను తిరిగి పెంపొందించాలంటూ సీఎం, పలువురు మాజీ అధికారులు, పండితుల నుంచి అభిప్రాయాలు వ్యక్తమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీటీడీ ఆగమ సలహా మండలి సభ్యులైన వేణుగోపాలదీక్షితులు, మోహనరంగాచార్యులు, రామకృష్ణదీక్షితులు, సీతారామచార్యులు, నూజివీడు గోపాల కృష్ణమాచార్యులు ఆలయంలో శాంతిహోమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. భక్తుల దర్శనాలకు, స్వామి కైంకర్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉదయం 6 నుంచి 10 గంటల నడుమ ఆలయంలోని బంగారుబావి వద్దనున్న మండపంలో శాంతిహోం నిర్వహించారు. కలుషిత నెయ్యి వినియోగం జరిగిన ప్రతి ప్రదేశంలో తొలుత వాస్తుదూపాన్ని వేశారు. యాగశాలలో సంకల్పం, విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనం, వాస్తుహోమం, కుంభప్రతిష్ఠ, పంచగవ్య ఆరాధన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చివరిగా ఆలయంలోపల, బయటప్రాంతాల్లో కుంభప్రోక్షణ చేయడంతో శాంతిహోమం ముగిసింది. దీంతో సర్వదోషాలు తొలగిపోయాయని అర్చకులు తెలిపారు. క్రతువు ముగిసిన గంటల వ్యవధిలోనే తిరుమలలో చిరుజల్లులు కురవగా.. ఇది మంచి పరిణామమని పండితులు అభిప్రాయపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





రాజుకున్న రాజకీయ వేడి

కల్తీ నెయ్యి వాడకంపై ఒకవైపు తిరుమల ఆలయంలో టీటీడీ శాంతి హోమం నిర్వహించగా.. మరోవైపు ఈ వివాదం రాజకీయంగా రాజుకుంది. టీటీడీ చైర్మన్‌గా తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భూమన కరుణాకరరెడ్డి సోమవారం తిరుమలకు వెళ్లారు. రాజకీయ ప్రసంగం చేయకూడదని పోలీసులు నోటీసులివ్వగా సంతకం చేశారు. ఎంపీ గురుమూర్తి, కుమారుడు అభినయ్‌రెడ్డితో కలిసి వెళ్లిన ఆయన శ్రీవారి పుష్కరిణిలో స్నానం చేసి బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అఖిలాండం వద్ద హారతి ఇచ్చే క్రమంలో ప్రార్థన చేస్తున్నట్లుగా.. రాజకీయ వ్యాఖ్యలు చేశారు. వెంటనే పోలీసులు అడ్డుకుని బలవంతంగా తిరుపతికి పంపారు. నిబంధనలు ఉల్లంఘించారని



వివిధ సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదైంది కూడా. ఈ వివాదం కేంద్రంగా రాజకీయ వేడి రాజుకుంది. భూమన ప్రమాణాన్ని నిరసిస్తూ టీడీపీ నేతలు తిరుపతిలో గోవిందనామాలతో శ్రీవారిని ప్రార్థించారు. మరోవైపు భవిష్యత్తులో ఇలాంటి అపచారాలు జరగకూడదని శ్రీవారి ప్రార్థిస్తూ తిరుమలలో టెంకాయలు కొట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మేము తప్పు చేసుంటే..

కల్తీ నెయ్యిలో మేం తప్పు చేసుంటే మా కుటుంబ సర్వనాశనమై, రక్తం కక్కి చనిపోవాలని పుష్కరిణిలో మునిగి ప్రమాణం చేశా. నేను క్రిస్టియన్ కాదు.. నాస్తికుడిని అంతకన్నా కాదు. వీటిపై కూడా ప్రమాణం చేయమన్నా చేస్తా. సిట్ కాదు.. సీబీఐ, సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేయించండి.

- భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్

నీ నాస్తిక ప్రమాణం ఒక ప్రామాణికమా?

- భూమనపై టీడీపీ నేతల ఆగ్రహం

తిరుపతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'నువ్వు నాస్తికుడివని ఊరంతా తెలుసు. అన్యమత అభిమానిగా అందరికీ పరిచయస్తుడివి. తిరుమల కొండపై నీలాంటి వ్యక్తి చేసే ప్రమాణాలకు ప్రామాణికత ఏముంటుంది?' అంటూ టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డిపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండపై భూమన చేసిన ప్రమాణాన్ని నిరసిస్తూ సోమవారం సాయంత్రం అలిపిరి గరుడ సర్కిల్లో గోవింద నామాలతో శ్రీవారిని ప్రార్థించారు. 'గత ఐదేళ్లలో తిరుమలను అపవిత్రం చేయడంతోనే చాలా దేవాలయాల్లో రథాలు కాలిపోయాయి. గోవిందరాజస్వామి గుడి వద్ద వటవృక్షం పడిపోయింది. తిరుమల కాలిబాటలో భక్తులను పులులు ఇబ్బంది పెట్టాయి. దేవుడంటే భయంలేదు కాబట్టే కొండపైన ప్రమాణాల డ్రామాలు ఆడారు' అని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విమర్శించారు.



తిరుమల అఖిలాండం వద్ద ప్రమాణాలు చేసిన కరుణాకర్ రెడ్డి అవినీతి అక్రమాలు, దేవస్థానం ఖజానాను ఖాళీ చేసిన వైనం నీ పరాకాష్టకు నిదర్శనమని తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్ పేర్కొన్నారు. 'ఇప్పుడు చేసిన పాపాలు చాలవా? బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి కోనేరును పరిశుభ్రం చేసి పవిత్రంగా ఉంచిన ఈ సందర్భంలో మళ్లీ ఆ కోనేట్లో స్నానం చేసి అపవిత్రాన్ని మూటకట్టుకున్నావు' అంటూ మండిపడ్డారు. ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్ వర్మ, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, బుల్లెట్ రమణ, మనోహరాచారి, ఆముదాల తులసీరాం, ఈతమాకుల హేమంత్ యాదవ్, రవిశంకర్ యాదవ్, బ్యాంకు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎవరు నెత్తురు కక్కాలో దేవుడు నిర్ణయిస్తాడు



గడిచిన ఐదేళ్లు తిరుమల కొండపై జరిగిన ఘోరాలను యావత్ హిందూ సమాజం చూసింది. లడ్డూ బాగలేదని తమిళనాడు నుంచి ఓ భక్త బృందం మాట్లాడితే విజిలెన్స్ వాళ్లతో కొట్టించలేదా? ఎవరు నెత్తురు కక్కాలో దేవుడు నిర్ణయిస్తాడు. వడ్డికాసులవాడు లెక్కలన్నీ తేలుస్తాడు. జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తం పొందకుండా జగన్ రెడ్డి ఎదురుదాడి చేయడమేంటో?

- ఓవీ రమణ, టీటీడీ మాజీ సభ్యుడు

శ్రీవారికి కొబ్బరికాయల సమర్పణ

తిరుమల, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): తిరుమల తెలుగుదేశం పార్టీ శ్రేణులు సోమవారం అఖిలాండం వద్ద కొబ్బరికాయలు సమర్పించారు. గత ప్రభుత్వంలో జరిగిన లోపాలు ఒకొక్కటిగా బయటకు వస్తుండంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి అపచారాలు జరగకుండా ఆశీస్సులు ఇవ్వాలని స్వామిని ప్రార్థించారు. తిరుమల టీడీపీ అధ్యక్షుడు రాజుయాదవ్ ఆధ్వర్యంలో 501 కొబ్బరికాయలు సమర్పించారు. లడ్డూప్రసాదంలో వాడే నెయ్యిలో కల్తీ జరగడం బాధాకరమన్నారు. లడ్డూ నాణ్యత పెంచేవిషయంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ వహించడంతో తిరిగి లడ్డూకు పవిత్ర చేకూరిందన్నారు.



రెవెన్యూలో స్థానచలనం

108 మందికి

- వీఆర్వోల బదిలీలు నేటికి వాయిదా

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23: తిరుపతి జిల్లాలో దాదాపు 108 మంది రెవెన్యూ ఉద్యోగులు సోమవారం బదిలీ అయ్యారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలతో అంటకాగిన కొంత మంది రెవెన్యూ సిబ్బంది.. ఇప్పుడూ కొందరు టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకుని తమ స్థానాలను పదిలం చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగాల్లో కొంతమందిపై అవినీతి ఆరోపణలున్న వాళ్లూ బదిలీ నుంచి తప్పించుకున్నారు. వీరంతా 'అన్ని విధాలా' పలుకుబడి ఉపయోగించుకున్నట్లు రెవెన్యూ శాఖలో విమర్శలు నెలకొన్నాయి. మరోవైపు ఇద్దరు ఉన్నతాధికారులు దాదాపు 24 గంటలు సమాలోచనలు జరిపి సిఫార్సు లేఖలున్న వారికి ప్రాధాన్యమిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తమ్మీద సోమవారం రాత్రి కలెక్టరేట్ అధికారులు విడుదల చేసిన బదిలీల జాబితాల్లో 36మంది డిప్యూటీ తహసీల్దార్లు, 50 మంది రెవెన్యూశాఖ సీనియర్ అసిస్టెంట్లు, 22మంది జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. అటు రాజకీయ నాయకులు, ఇటు కలెక్టరేట్‌లోని ఇద్దరు అధికారులు తమకు కావాల్సిన వారికి పోస్టింగ్ వేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక, జిల్లాలో వీఆర్వోల బదిలీలు సాగుతూ.. వాయిదా పడ్డాయి. సుమారు 200మందికి మంగళవారం ఉదయం పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు సమాచారం. మిగిలిన వారిని యథాస్థానంలో ఉంచేందుకు రాజకీయ సిఫార్సులు, అధికారుల సహకారం అందనుంది.

డిస్కంలో భారీగా బదిలీలు

తిరుపతి, (ఆటోనగర్): సదరన్ డిస్కంలోని తిరుపతి సర్కిల్‌లో 76 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈఈలు 28, ఏడీఈలు 58 మందిని బదిలీ చేస్తూ సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు ఇచ్చారు. చేశారు. తిరుపతి సర్కిల్ పరిధిలో ఈఈల బదిలీల్లో భాగంగా తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న చంద్రశేఖర్ తిరుపతి టౌన్ డివిజన్ ఈఈగా.. ఆ స్థానంలో ఉన్న కె.వాసుదేవ రెడ్డిని చిత్తూరు ఎం ఎండ్‌పీకి బదిలీ చేశారు. తిరుపతిరూరల్ డివిజన్ ఈఈ మినహా మిగిలిన వారిని కూడా బదిలీ చేశారు. అలాగే డీవైఈఈలను అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సూచనల మేరకు బదిలీలు చేసినట్లు తెలిసింది.

ఎక్సైజ్‌లో బదిలీల పైరవీలు

- ఒక్కో సీటుకు 10 సిఫార్సు లేఖలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 23: ఎక్సైజ్ శాఖలో బదిలీల పైరవీలు ఊపందుకున్నాయి. ప్రధానంగా తిరుపతి, చంద్రగిరి, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి ప్రాంతాలకు స్థానిక ప్రజాప్రతినిధులు కొందరు ఒక్కో సీటుకు 10 నుంచి 12 మందికి సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు సమాచారం.గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో కలిసి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కొందరు ఉద్యోగులు.. ప్రస్తుతం తమ స్థానాలను పదిలం చేసుకునే పనిలో పడ్డారు. కోరుకున్న స్థానాల్లో కూర్చోవడానికి ఇంకొందరు కూటమి ప్రజాప్రతినిధుల ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లా కేంద్రమైన తిరుపతికి ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ఈఎస్ నుంచి ఏఈఎస్, సీఐలుగా పని చేయడానికి గట్టి పోటీ వుంది. తిరుపతికి పొరుగు నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఒకరు తాము సిఫార్సు లేఖ అందచేసిన ఇద్దరు అధికారుల్లో ఒకరిని సీఐగా నియమించాలని మంత్రి కొల్లు రవీంద్రకు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.



వరద బాధితుల కోసం..

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి సోమవారం సీఎం చంద్రబాబుకు రూ.20 లక్షల చెక్కు అందజేస్తున్న తిరుపతిలోని స్విమ్స్ డైరెక్టరు ఆర్వీ కుమార్

కడపజోన్ ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి బదిలీ

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 23: కడపజోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇటీవల ఆయన పదోన్నతిపై కడప జోన్ ఈడీగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. వారం వ్యవధిలోనే బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఖాళీగా ఉన్న తిరుపతి డీపీటీవో పోస్టును రేపో మాపో భర్తీ చేయనున్నట్లు తెలిసింది. కడపజోన్ ఈడీగా పి.చంద్రశేఖర్, చిత్తూరు డీపీటీవోగా జగదీష్‌ను బదిలీ చేశారు. అలాగే వాకాడు డిపో మేనేజర్‌గా పెంచలయ్య, కుప్పం డిపో మేనేజర్‌గా గోపీనాథ్, శ్రీకాళహస్తి ఇన్‌చార్జి డీఎంగా తిరుపతి డిపో మేనేజర్ టి.బాలాజీ నియమించారు.

డబుల్ డెక్కర్ ఫర్ సేల్

- సెకండ్ హ్యాండ్‌లో అమ్మేస్తాం కొనుక్కోండి ప్లీజ్
- బస్సును వదిలించేందుకు కార్పొరేషన్ బేరసారాలు



తిరుపతి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ నేతలు కార్పొరేషన్ నిధులతో వెచ్చించి ఆర్భాటాల కోసం తీసుకొచ్చిన డబుల్ డెక్కర్ బస్సును అమ్ముకునేందుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ఎంతోకొంతకు అమ్మేస్తాం.. ప్లీజ్ అంటూ బేరసారాలు నడుపుతున్నారు. అయితే సెకండ్ హ్యాండ్‌లో అమ్ముతామన్న కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో గార్బేజ్ షెడ్డులో పడున్న బస్సును వదిలించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. దాదాపు రూ2.5 కోట్ల ప్రజాధనం పోసి కొన్న ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సు చెత్తకుప్పల్లో దొరికే పాత బొమ్మలా మారిపోవడాన్ని సోమవారం కమిషనర్ ఎన్.మౌర్య దృష్టికి మీడియా ప్రతినిధులు తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆమె వైజాగ్ మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తమదగ్గర డబుల్ డెక్కర్ బస్సు ఉందని ఏదోఒక ధరకు ఇచ్చేస్తామని చెప్పారు. డబుల్ డెక్కర్‌పైన వైజాగ్‌లాంటి నగరపాలక సంస్థ కూడా అంగీకరించకపోవడంతో 'మీరే ఏదైనా మార్గం చెప్పండి' అని మీడియా ప్రతినిధులనే అడిగారు. ఇటీవల జూపార్కుకు మినీ డబుల్ డెక్కర్ బస్సును కొనుగోలు చేశారని, అక్కడ ప్రయత్నం చేయమని చెప్పడంతో విచారించమని అధికారులను ఆదేశించారు.

నాడు గొప్పలు.. నేడు తిప్పలు

దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా తిరుపతికి డబుల్ డెక్కర్ బస్సు తీసుకొచ్చామని వైసీపీ స్థానిక నేతలు గొప్పలు చెప్పారు. అక్కరకు రాక దానిని అమ్ముకునేందుకు ఇప్పుడు అధికారులు తిప్పలు పడుతున్నారు. మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి గత ఏడాది ఆగస్టు 8న జరిగిన కౌన్సిల్లో ప్రతిపాదించి రూ2.30కోట్ల కార్పొరేషన్ సాధారణ నిధులనుంచి డబుల్ డెక్కర్ బస్సు కొనుగోలు చేయించారు. తొలుత బస్సును ఆర్టీసీకి అప్పగించి అద్దె వసూలు చేయాలనుకున్నారు. ఈ తరహా బస్సుల నిర్వహణకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో వారు నిరాకరించారు. చివరకు కార్పొరేషన్ భుజాలకెత్తుకుంది. ఇరుకురోడ్లలో బస్సు రాకపోకలకు కష్టతరంగా మారడంతో రాత్రికిరాత్రే రెండువేలకు పైగా చెట్ల కొమ్మలను నేలకూల్చి, నిలువ నీడ లేకుండా చేశారు. గత ఏడాది అక్టోబరు 12న బస్సును రోడ్డుపైకి తీసుకొచ్చారు. ఎక్కడ ఎక్కి దిగినా రూ.50 బస్సు ఛార్జీని నిర్ణయించారు. రోజుకు పది మందికూడా ఎక్కకపోవడంతో కొంతకాలం ఉచితంగా తిప్పారు. బస్సుకు ఆర్టీసీ నుంచి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు. కానీ దర్జాగా రోడ్లపై తిరిగేసింది. చట్టరీత్యా నేరం కావడంతో కార్పొరేషన్ అధికారులకు రవాణాశాఖ అధికారులు లేఖ రాశారు. బస్సు సీజ్ చేయాల్సివస్తుందని హెచ్చరించినట్టు తెలిసింది. దీంతో వినాయకసాగర్ వద్దగల గార్బేజ్ షెడ్డులో బస్సును పార్కు చేసి పెట్టేశారు.

మరో 65 మంది ఇంటికి..!

- వైసీపీ హయాంలో ఎస్వీయూలో చేరిన ఉద్యోగులపై ప్రభుత్వం కొరడా
- తక్షణ నివేదిక పంపాలని అధికారులకు ఆదేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 23: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్వీయూలో చేరిన మరో 65 మంది ఉద్యోగులను ఇంటికి సాగనంపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. తాజాగా 14 మందిని తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరో 65 మంది తొలగింపు విషయమై యూనివర్సిటీ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై తక్షణం తమకు నివేదిక పంపాలని ఇటీవల ప్రభుత్వం నుంచీ యూనివర్సిటీకి ఆదేశాలు వచ్చినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీంతో ఆ ఉద్యోగుల జాబితాను యూనివర్సిటీ అధికార యంత్రాంగం సిద్ధం చేసినట్టు సమాచారం. ఇందులో ఉద్యోగి పేరు, విద్యార్హత, వర్క్ ప్లేస్, వేతనం, ఎవరి సిఫారసుతో ఉద్యోగంలో చేరారనే అంశాలతో నివేదికను ప్రభుత్వానికి పంపినట్టు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచీ సంకేతాలు వెలువడిన వెంటనే ఈ 65 మంది ఉద్యోగులకు పొడిగింపు ఉత్తర్వులు నిలిపివేయడం ద్వారా ఉద్యోగాల నుంచీ తొలగించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

ముక్కంటి ఆలయ ఈవోగా చంద్రశేఖర్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా చంద్రశేఖర్ ఆజాద్ (ఎఫ్ఏసీ) బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి ఆర్డేసీగా నియమితులైన ఈయనకు ముక్కంటి ఆలయ ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన స్వామిఅమ్మవార్లను దర్శించుకుని, బాధ్యతలు స్వీకరించారు. ఆలయంలోని పలు విభాగాలను తనిఖీ చేశారు.



భార్య, బంధువులపై భర్త దాడి

దొరవారిసత్రం, సెప్టెంబరు 23: దొరవారిసత్రం మండలం సింగనాలతత్తూరు దళితవాడలో ఎర్రబోతు కల్యాణ్ తన భార్య కోటమ్మను ఆదివారం రాత్రి చితకబాదాడు. అడ్డు వచ్చిన అత్త మస్తానమ్మను కొట్టి గాయపరిచాడు. ఈ ఘటనలో తల్లీ కూతుళ్లకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకొన్న కోటమ్మ సోదరులు కారికాడు గ్రామానికి చెందిన నవీన్, హరిబాబు సింగనాలతత్తూరు గ్రామానికి చేరుకుని కల్యాణ్‌ను నిలదీశారు. మద్యం మత్తులో ఉన్నం కల్యాణ్ నవీన్, హరిబాబుపై మచ్చు కత్తితో దాడికి తెగబడ్డాడు. ఘటనలో గాయపడిన నవీన్, హరిబాబును తిరుపతికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. తనతో పాటు తల్లి, సోదరులపై దాడికి పాల్పపడిన కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని కోటమ్మ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఎమ్మెల్యే ఫ్లెక్సీల చించివేతపై ఫిర్యాదు

గూడూరు, సెప్టెంబరు 23: మండలంలోని తిమ్మనముద్రం గ్రామంలో సోమవారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మండల టీడీపీ నాయకులు స్వాగతం పలుకుతూ పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన కొందరు ఆ ఫ్లెక్సీలను చించివేశారు. సోమవారం ఉదయం టీడీపీ నాయకులు గుర్తించిన గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు ఫ్లెక్సీలను చించివేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కర్మాగారంలో పొగలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 23: నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని ఎకోబిట పరిశ్రమలో చిమ్నీ పేలి కర్మాగారమంతా దట్టమైన పొగలు వ్యాపించాయి. హుటాహుటిన కంపెనీ యాజమాన్యం సమస్యను గుర్తించి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టింది. సాంకేతిక లోపంతో ఈ సంఘటన చోటుచేసుకుందని తెలిపారు. ఈ ఘటనలో కార్మికులకు ఎటువంటి గాయాలు కాలేదు.

మట్టి ట్రాక్టర్ స్వాధీనం

కోట, సెప్టెంబరు 23: మండల పరిధిలోని పెన్నక్క చెరువులో నుంచి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. టాక్టర్‌ను మైనింగ్‌శాఖకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతర ఏర్పాట్లలో అలసత్వం వద్దు: కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెంబరు 23: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఏర్పాట్లలో అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం పింజలవీరయ్య కల్యాణ మండపంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి జాతర నిర్వహణపై అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతరలో ఏ శాఖ అధికారులు ఏ బాధ్యతలు స్వీకరించారో అడిగి తెలుసుకొన్నారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకోవాన్న ఉద్దేశంతోనే వీవీఐపీ పాసులను కూడా రద్దు చేయం జరిగిందన్నారు. ఈసందర్భంగా త్రిభువని సినిమా థియేటర్ యజమాని ప్రభాకర్ అమ్మవారి బంగారు పాదుకల తయారీకి రూ.లక్ష విరాళం అందచేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ, ఎంపీపీ తనూజారెడ్డి, సబ్‌కలెక్టర్ వీరరాఘవ మీనా, ఏఎస్పీ రవిమనోహర్ ఆచారి, డీఎస్పీ రమణకుమార్ పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

జాతర ఏర్పాట్లపై ఎస్పీ ఆరా

పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై ఎస్పీ సుబ్బరాయుడు ఆరా తీశారు. జీనిగల వారివీధిలోని అమ్మవారి అత్తవారి ఇల్లుగా భావించే చాకలింట వద్ద, కుమ్మరి వీధిలోని అమ్మవారి పుట్టి నిల్లుగా భావించే కుమ్మరింటి వద్ద బారికేడ్ల ఏర్పాట్లు, అమ్మవారి దర్శన క్యూలైన్లు, నిరూప మండపం వద్ద బందోబస్తు ఏర్పాట్లు, అమ్మవారు చప్రం తిరిగే మార్గాలను పరిశీలించారు. అక్కడ చేపట్టే ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకుని, పోలీసులకు తగు సూచనలు ఇచ్చారు.

దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 23: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీల్లో భాగంగా దీపావళి పండుగ నుంచి ఏడాదికి మూడు గ్యాస్ సిలండర్లను ఉచితంగా అందించే పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. సోమవారం గూడూరు మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజావేదిక సభ ద్వారా ప్రజలకు వివరిస్తున్నామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఒక్క పనీ జరగలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకోవడమే కాకుండా కలియుగ దైవం వెంకన్న స్వామి పవిత్ర ప్రసాదమైన లడ్డూలోనూ భారీ అవినీతికి పాల్పడి అపచారం చేసి భక్తులను మోసం చేసిందన్నారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను వెయ్యి రూపాయలు పెంచి రూ.4 వేలుగా ఒకటో తేదీ నాడే లబ్ధిదారుల ఇంటికి నేరుగా అందజేస్తున్నారని కొనియాడారు. అలాగే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజలకు ఆస్తులకు రక్షణ కల్పించిందన్నారు. పేదలకు రూ.5కే ఆకలి తీర్చేలా అన్న క్యాంటీన్లను ప్రారంభించిందని వివరించారు. అనంతరం 'పొలం పిలుస్తోంది' పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు రాజు, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తిరుపాల్, దుద్దా రాఘవ రెడ్డి, నంబూరు వెంకటే శ్వర్లు నాయుడు, శివకుమార్, రమణయ్య, జనార్దన్‌రెడ్డి, తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో వెంకటేశ్వర రావు, సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకొల్లును అభివృద్ధి చేస్తాం: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, సెప్టెంబరు 23: దొరవారిసత్రం మండలం ఏకొల్లును అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. సోమవారం ఏకొల్లులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు గ్రామంలో సరైన తాగునీటి వసతి లేదని, గిరిజనుల గృహాలు ఉరుస్తున్నట్లు తెలిపారు. అలాగే సర్వే నెంబరు 463లో 20 ఏళ్ల క్రితం పట్టాలు ఇచ్చారని, అయితే ఇప్పటి వరకు భూములు చూపించలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం మాట్లాడుతూ తిరుమల లడ్డూకు వినియోగించే నెయ్యి కల్తీపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేయించి దోషులు శిక్ష పడేలా చూస్తుందన్నారు. కేవలం కమీషన్ల కక్కుర్తితో నెయ్యి కల్తీకి పాల్పడినట్లు విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచు ఆవుల బ్లసీ, తహసీల్దారు శైలాకుమారి, వ్యవసాయశాఖ ఏడీఏ అనిత, ఏవో జ్యోతిర్మయి, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, నాయకులు పామంజి శ్రీనివాసులు, శ్రీహరిరెడ్డి, రత్నయ్య, కిషోర్ నాయుడు, రమణయ్య, ఉదయ్‌కుమార్, కృష్ణమూర్తి తదితరలు పాల్గొన్నారు.

పేదలకు అండగా చంద్రన్న ప్రభుత్వం: కురుగొండ్ల

బాలాయపల్లి, సెప్టెంబరు 23: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని కడగుంట గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో పవిత్రమైన తిరుమల లడ్డూలో కల్తీనెయ్యిని వినియోగించి అపచారానికి పాల్పడిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రే స్వయంగా వరదలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించారన్నారు. సెలవుదినాల్లో కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారుల చేత పనిచేయించడం హర్షణీయమన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మొదటిసారిగా కడగుంటకు వచ్చిన కురుగుండ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎంపీడీవో వినీల్‌కుమార్, డీటీ శిరీషా, నాయకులు రాయి మస్తాన్‌నాయుడు, కూను శ్రీహరి, రాయి సత్యం నాయుడు, చిత్తూరు ఈశ్వరయ్య, బూతు ప్రసన్నకుమార్, సీసీ నాయుడు, కొర్రపాటి రామచంద్రనాయుడు, వేళ్ల సురేంద్రరెడ్డి, హఫీజ్, చిత్తూరు పద్మనాభం, మన్నెమాల గోపీకృష్ణారెడ్డి, తాల్లూరు ప్రసాద్ నాయుడు, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

కష్టపడే వారికి టీడీపీ అండగా నిలుస్తుంది



మస్తాన్‌నాయుడికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 23: టీడీపీ బలోపేతానికి కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక నిమ్మ మార్కెట్‌లో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఆరికట్ల మస్తాన్ నాయుడు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. మస్తాన్ నాయుడుకు పుట్టిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మస్తాన్‌నాయుడు మొదటి నుంచి టీడీపీలో ఉంటూ పార్టీ కోసం ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, వాటంబేడు శివకుమార్, బెజవాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులురెడ్డి



గూడూరు, సెప్టెంబరు 23: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గూడూరుకు చెందిన పంటా శ్రీనివాసులు రెడ్డిని ఆ పార్టీ అధిష్టానం సోమవారం నియమించింది. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తాన చెప్పారు. తనకు ఈ పదవి అప్పగించిన రాహుల్‌గాంధీ, వేణుగోపాల్, వైఎస్ షర్మిలకు ధన్యవాదాలు తెలిపారు.

సీఎం సహాయనిధికి చెక్కు అందజేత

గూడూరు అర్బన్, సెప్టెంబరు 23: వరద బాధితుల సహాయార్థం గాయత్రి ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు రూ.53వేల చెక్కును సీఎం సహాయనిధికి అందజేశారు.

నిధుల దుర్వినియోగంపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

వాకాడు, సెప్టెంబరు 23: మండలంలోని నిడిగుర్తి పంచాయతీ సర్పంచు మల్లాపు నాగరాజు నిధులు దుర్వినియోగం చేశారంటూ టీడీపీ నాయకులు రమణయ్య, ధనంజయ, నాగరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు సోమవారం సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత మూడున్నరేళ్లుగా జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించకుండా, ఎలాంటి తీర్మానం లేకుండా సర్పంచు రూ.6,33,953 నగదు, 640 బస్తాల సిమెంట్ దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 23: నాయుడుపేట - మల్లాం జంక్షన్ కూడలి సమీపంలోని టీ దుకాణంలో అక్రమంగా నిల్వచేసిన 33 మద్యం బాటిళ్లను ఎస్‌ఐ ప్రేమయ్య స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

నాయుడుపేట కమిషనర్‌గా ఫజులుల్లా



నాయుడుపేట, సెప్టెంబరు 23: నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌గా షేక్ ఫజులుల్లా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న జనార్దన రెడ్డి పీఆర్ అండ్ ఆర్‌డీ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఫజులుల్లాను ఇక్కడకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్పీడీసీఎల్ ఈఈగా శ్రీనివాసులు



నాయుడుపేట, సెప్టెంబరు 23: ఎస్పీడీసీఎల్ నాయుడుపేట డివిజన్ ఈఈగా వై.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఇక్కడ ఈఈగా పని చేస్తున్న ప్రసన్నకుమార్ పదవీ విరమణ చేశారు. దీంతో పులివేంద్రంలో పనిచేస్తున్న శ్రీనివాసులును ఇక్కడకు బదిలీ చేయడంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు.

చెంగాళమ్మ ఆలయ ఈవోగా ప్రసన్నలక్ష్మి



సూళ్లూరుపేట, సెప్టెంబరు 23: చెంగాళమ్మ ఆలయ ఈవోగా (సహాయ కమిషనర్) ప్రసన్నలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరులో దేవదాయశాఖ ఏసీగా ఉన్న ఈమెను చెంగాళమ్మ ఆలయానికి బదిలీ చేశారు.

ఏపీటీగా స్వాతిరెడ్డి

కోట, సెప్టెంబరు 23: కోటలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా స్వాతిరెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. నాయుడుపేట నుంచి స్వాతిరెడ్డి ఇక్కడ బదిలీపై రాగా, ఇక్కడ ఏపీపీగా పనిచేస్తున్న కేదార్‌నాథ్ నాయుడుపేటకు బదిలీపై వెళ్లినట్లు న్యాయవాదులు తెలిపారు.

పాతకక్షలతో ఘర్షణ: ఒకరికి తీవ్ర గాయాలు

దొరవారిసత్రం, సెప్టెంబరు 23: మండలంలోని మోదుగులపాళెంలో ఆదివారం రాత్రి రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు... మోదుగులపాళెం పాత హరిజనవాడకు చెందిన మాయారి సాయిచందుతో పాత కక్షల కారణంగా సురేష్, మాధవ్, మునిశేఖర్, మునిచంద్ర గొడవ పడ్డారు. సాయిచందు చిన్నాన్న మాయారి సుబ్రహ్మణ్యం సర్దుబాటు చేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో సాయిచందును మాధవ్ కత్తితో నరకబోయాడు. సాయిచందు తప్పించుకోగా, ఆ కత్తి పక్కనే ఉన్న సుబ్రహ్మణ్యానికి తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సురేష్ బృందం అక్కడ నుంచి పారిపోయింది. గాయపడిన సుబ్రమణ్యంను స్థానికులు సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

నెల్లూరు మైనింగ్ డీడీగా చంద్రశేఖర్

నెల్లూరు(వెంకటేశ్వరపురం) సెప్టెంబరు 23: నెల్లూరు జిల్లా మైనింగ్ శాఖ డీడీగా ఎన్.చంద్రశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడున్న శ్రీనివాసకుమార్‌ను విజయవాడ డీడీగా బదిలీ చేసింది. కాగా, గూడురు సబ్ డివిజన్ ఏడీగా ఉన్న రంగకుమార్ అన్నమయ్య జిల్లా మదనపల్లికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో పార్వతీపురం నుంచి కే.శ్రీనివాస్ నియమి తులయ్యారు. నెల్లూరు మైనింగ్ ఆర్‌ఐగా ఉన్న దేవి సింగ్‌ను అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఇబ్రహీంపట్నం నుంచి సీహెచ్.స్వాతిని నియమించారు. గూడూరు ఏజీ నరేష్‌ను తిరుపతికి బదిలీ చేయగా, అనకాపల్లి నుంచి టీ.సుబ్బరాయుడును ఆయన స్థానంలో నియ మించారు. గూడురు ఆర్‌ఐగా ఉన్న గంగాధర్‌ను ఇబ్రహీంపట్నంకు, అక్కడున్న ఎం.బాలమురళిని గూడురుకు బదిలీ చేశారు.

సైన్స్‌ఫేర్‌లతో సృజనాత్మకత

నాయుడుపేట, సెప్టెంబరు 23: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపుదలకు సైన్స్‌ఫేర్‌లు ఎంతగానో దోహదపడుతాయని డిప్యూటీ ఈవో శాంతి అన్నారు. నాయుడుపేట ఎల్‌ఏ సాగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం సైన్స్‌ఫేర్ మాంక్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలు సరళీకృతంగా అర్థమయ్యేందుకు ప్రయోగాల ద్వారా వివరించాలన్నారు. సైన్స్‌ఫేర్‌లు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో విద్యాభ్యాసాలపై ఆసక్తి పెరిగి మంచి ప్రయోగాలు చేయగలుగుతారన్నారు. సైన్స్‌ఫేర్ మాంక్ వర్క్‌షాపులో ఉమ్మడి గూడూరు డివిజన్ పరిధిలో 150 మంది సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జాతీయస్థాయిలో ఇన్‌స్పైర్ ప్రాజెక్టులో పారిశుధ్య కార్మికులు శుభ్రపరిచే ఆధునిక పరికరాలను ప్రదర్శించిన దొరవారిసత్రం మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, జిల్లా సైన్స్ ఆఫీసర్ భానుప్రసాద్, హెచ్‌ఎం అన్నామణి, కోఆర్డినేటర్ రివేష్, రవి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

చిల్లకూరు, సెప్టెంబరు 23: జిల్లాస్థాయి ఉత్తమ వ్యాయమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ శ్రీనివాసులును పాఠశాల సిబ్బంది సోమవారం సన్మానించారు. హెచ్‌ఎం జాన్‌పీటర్ మాట్లాడుతూ పీడీ శ్రీనివాసులు శిక్షణలో ఎంతోమంది విద్యార్థులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై రాణించారన్నారు. కార్యక్రమంలో రిటైడ్ హెచ్‌ఎం కోదండరామ్, ఉపాధ్యాయులు శ్రీని వాసులు, శంకరయ్య, మల్లికార్జున్, చంద్ర, జానకిరామయ్య, శిరేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసులును సన్మానిస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన

చిల్లకూరు, సెప్టెంబరు 23: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలుగు రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి అన్నారు. సోమవారం మండలంలోని ఓడూరు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందరోజుల కూటమి పాలనతో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కీరవాణి, రాఘవులు, పంచాయతీ కార్యదర్శి జమీర్‌బాషా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో భారీగా బదిలీలు

20 మంది ఎంపీడీవోలకు స్థానచలనం

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 23: నెల్లూరు జిల్లా పరిషత్‌లో ఎంపీడీవోల నుంచి కార్యాలయ సబార్డినేటర్స్ వరకు 272మందిని బదిలీ చేస్తూ కలెక్టరు ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 20మంది ఎంపీడీవోలు, 27 మంది ఏవోలు, 44 మంది సీనియర్ అసిస్టెంట్లు, 71 మంది జూనియర్ అసిస్టెంట్లు, 22మంది టైపిస్టులు, 26మంది గ్రంథాలయ అసిస్టెంట్లు, 62 మంది కార్యాలయ సబార్డినేటర్స్ ఉన్నారు.

బదిలీ అయిన ఎంపీడీవోలు వీరే!

ఎంపీడీవో	ప్రస్తుతం స్థానం	బదిలీ అయిన స్థానం
ఎం.శ్రీహరి	కోవూరు	బుచ్చిరెడ్డిపాళెం
కె.ప్రత్యూష	ముత్తుకూరు	కలిగిరి
ఎం.బ్రహ్మయ్య	కొండాపురం	జలదంకి
ఎ.మధుసూదన రావు	అనంతసాగరం	గూడూరు
జి.వెంకటేశ్వర్లు	మనుబోలు	దగదర్తి
ఎం.భవాని	కోట	రాపూరు
ఎ.ప్రమీలా రాణి	సూళ్లూరుపేట	పెళ్లకూరు
ఎం.భాస్కర్	సెలవుల్లో..	ఎస్ఆర్ పురం
కె.వెంకటేశ్వర రావు	గూడూరు	టీపీ గూడూరు
కె.సురేష్‌బాబు	పెళ్లకూరు	నాయుడుపేట
పి.ప్రసన్నకుమారి	డక్కిలి	ఏస్‌పేట
కె.గోవర్ధన్	కలువాయి	డీవీ సత్రం
వి.రజినీ కాంత్	ఓజిలి	అల్లూరు
ఈవి.నరసింహారావు	బుచ్చిరెడ్డిపాళెం	పొదలకూరు
ఏవీ సుబ్బారావు	బోగోలు	కొడవలూరు
పి.సుబ్రహ్మణ్యం	కొడవలూరు	బోగోలు
కె.షాలేట్	చిట్టమూరు	సంగం
పి.నాగమణి	మర్రిపాడు	ముత్తుకూరు
టి.నాగేష్‌కుమారి	పొదలకూరు	విడవలూరు
వివి.సూర్యసాయి	చిల్లకూరు	వాకాడు